ప్రజాశక్తి

సోమవారం 21 ఏప్రిల్ 2025

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

ఎట్టకేలకు డిఎస్‌సి

శిక్షణలో డిఎస్‌సి అభ్యర్థులు (ఫైల్ ఫొటో)

- ఉమ్మడి విశాఖలో 1134 పోస్టుల భర్తీ
- వాటిలో ఆశ్రమ పాఠశాలల్లో 400
- నోటిఫికేషన్ విడుదలతో అభ్యర్థుల్లో ఆనందం

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

దాదాపు ఒక విద్యా సంవత్సరం ఆలస్యంగా డిఎస్‌సి నోటిఫికేషన్‌ను ప్రభుత్వం విడుల చేసింది. 2024 ఎన్నికల ప్రచారంలో తాను అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డిఎస్‌సి నోటిఫికేషన్‌పై మొదటి సంతకం పెడతానని చంద్రబాబు హామీ ఇచ్చారు. 2024 జూన్ 13న సిఎంగా బాధ్యతలు చేపట్టిన రోజు డిఎస్‌సి ఫైల్‌పై సంతకం చేశారు. అప్పటి నుంచి నోటిఫికేషన్‌ను వాయిదా వేసుకుంటూ వచ్చి ఎట్టకేలకు ప్రకటించారు. సుమారు ఏడేళ్ల తరువాత ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి పాఠశాల విద్యాశాఖ ఆదివారం నోటిఫికేషన్ జారీచేయడంతో ఉపాధ్యాయ అభ్యర్థుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. రాష్ట్రంలో 16,347 ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీకి జారీచేసిన నోటిఫికేషన్‌లో ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ప్రభుత్వ, జిల్లా, మండల పరిషత్, పురపాలక పాఠశాలల్లో 734, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో 400 ఉపాధ్యాయ ఖాళీలు భర్తీకానున్నాయి. జోన్-1లోని ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఎపి రెసిడెన్షియల్, ఆదర్శ పాఠశాలలు, సాంఘిక, బిసి, గిరిజన సంక్షేమ గురుకులాల్లో పిజిటి 73, టిజిటి 299, పీడీ 6, పిఇటి 22 ఉద్యోగాలను భర్తీ చేయనున్నారు. పరీక్షలు 45 రోజుల్లో ప్రారంభం కానున్నాయి. నోటిఫికేషన్ విడుదల చేసిన రోజు నుంచి మే 15 వరకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలి.

భర్తీకానున్న ప్రభుత్వ, జిల్లా, మండల పరిషత్, పురపాలక పాఠశాలల్లోని 734 ఉపాధ్యాయ పోస్టుల్లో ఎస్‌జిటిలు అధికంగా ఉన్నాయి. ఆశ్రమ పాఠశాలల్లోని ఇంగ్లీష్, జీవశాస్త్రం, మిగతా 2లో..

స్కేటింగ్‌లో డివి.ప్రీస్టిక సత్తా

రజతం సాధించిన ప్రీస్టిక

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పంజాబ్ రాష్ట్రంలోని మొహాలీలో జరిగిన రెండో జాతీయ స్థాయి ఓపెన్ ఛాంపియన్‌షిప్ స్కేటింగ్ పోటీల్లో నగరానికి చెందిన ప్రీస్టిక సత్తా చాటింది. ఐదో తరగతి చదువుతున్న ఆమె 10-12 ఏళ్ల బాలికల విభాగం స్పీడ్ స్లాలమ్‌లో రజతం, క్లాస్ స్లాలమ్‌లో రజతం కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా ప్రీస్టికను ఇండియన్ అమెచ్యూర్ రోలర్ స్కేటింగ్ అకాడమీ కార్యదర్శి ఎస్.లక్ష్మణ్, కోచ్‌లు సింహాద్రి, మనోహర్, ఇతర స్కేటర్లు అభినందించారు. ఆమె ఇండియన్ అమెచ్యూర్ రోలర్ స్పోర్ట్స్ అకాడమీలో సింహాద్రి, మనోహర్ మార్గదర్శకత్వంలో 2022 మేలో ఇన్లైన్ ఫ్రీస్టైల్ స్కేటింగ్‌లో తన ప్రయాణాన్ని ప్రారంభించింది. పలు రాష్ట్ర, జాతీయ పోటీల్లో పాల్గొని 9 స్వర్ణాలు, 4 రజతాలతో సహా మొత్తం 15 పతకాలు సాధించింది. అంతేకాకుండా 2022 నవంబర్ నుంచి ఇండియన్ మోడ్రన్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీలో ఎంవి.రమణ వద్ద కరాటేలో శిక్షణ పొందింది. భారతదేశంలో జరిగిన వివిధ జాతీయ, అంతర్జాతీయ పోటీలలో పాల్గొని 5 స్వర్ణాలు, 6 రజతాలతో కలిపి మొత్తం 15 పతకాలు సాధించింది.

రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్ రైళ్లు రద్దు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : చక్రధర్‌పూర్ డివిజన్‌లో ప్రీ నాన్-ఇంటర్‌లాక్, నాన్-ఇంటర్‌లాక్ పనుల కారణంగా రైలు నెంబర్ 18118 గుణుపూర్ - రూర్కెలా రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్‌ను ఏప్రిల్ 24న, రైలు నెంబర్ 18117 రూర్కెలా-గుణుపూర్ రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్‌ను ఏప్రిల్ 25న రైల్వే అధికారులు రద్దు చేశారు. ప్రజలు పై మార్పులను గమనించి తదనుగుణంగా వ్యవహరించాలని పేర్కొన్నారు.

అక్రమార్కులకు వరంగా ఉచిత ఇసుక

వార్త 8లో..

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు

వార్త 4లో..

శాస్త్రీయ పద్ధతులు అలవాటు చేసుకోవాలి

వార్త 4లో..

సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న కె.హేమలత

కార్మిక, కర్షకులకు
మోడీ సర్కారు ద్రోహం

- మే 20న జాతీయ సమ్మెను జయప్రదం చేయండి
- సిఐటియు అఖిల భారత అధ్యక్షురాలు డాక్టర్ కె హేమలత

వార్త మెయిన్‌లో..

జంతు సంరక్షణకు ప్రత్యేక ఏర్పాట్లు

- వేసవి నేపథ్యంలో అప్రమత్తంగా ఉన్నాం
- సందర్శకులకు అన్నిచోట్లా సౌకర్యాలు
- 'ప్రజాశక్తి'తో ఇందిరాగాంధీ జంతు ప్రదర్శన శాల క్యూరేటర్ జి.మంగమ్మ

ప్రజాశక్తి - ఆరిలోవ

వేసవి నేపథ్యంలో ఇందిరా గాంధీ జంతు ప్రదర్శన శాలలో జంతువుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్టు జూ క్యూరేటర్ జి.మంగమ్మ తెలిపారు. సందర్శకులకు కల్పిస్తున్న సౌకర్యాలను, భవిష్యత్తులో జూ అభివృద్ధికి చేపట్టబోయే చర్యలను, జూ పార్కుకు తీసుకురానున్న కొత్త జంతువుల విశేషాలను ఆమె 'ప్రజాశక్తి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే..

జంతువుల సంరక్షణకు తీసుకుంటున్న చర్యలేంటి ?

వేసవిని దృష్టిలో ఉంచుకుని జంతువులను చల్లగా ఉంచేందుకు పలు ఏర్పాట్లు చేశాం. పాములు, పులులు తదితర వాటికి వాటర్ స్ప్రింకర్లు ఏర్పాటు చేశాం. హైనాలు, తోడేళ్లు, చింపాంజీలకు ఫ్యాన్లు, కూలర్లు పెట్టాం. పక్షులకు ఖుస్, ఖుస్ మ్యాట్‌లు ఏర్పాటు చేసి చల్లదనం కోసం ఎప్పటికప్పుడు నీళ్లతో తడుపుతూ ఉన్నాం. అన్ని జంతువుల నైట్‌హౌస్‌లకూ కూల్ రూఫ్‌లు ఏర్పాటు చేశాం. అన్ని ఎన్‌క్లోజర్లలో చల్లదనం కోసం చర్యలు చేపట్టాం. డే, నైట్ క్రాల్స్‌లోని అన్ని నీటి పాయింట్ల వద్ద నీటి లభ్యతను నిర్ధారించడం, సరిపడా నీటిని నిల్వ చేయడం

జరుగుతోంది. శాఖాహారం అందిస్తున్నాం. నీటి శాతం ఎక్కువుగా ఉండే కూరగాయలు

పెడుతున్నాం. పండ్ల మోతాదు పెంచాం. జూ పార్కులో ఉంచిన పక్షులకు గ్లూకోజ్, విటమిన్, ఎలక్ట్రోలైట్ సప్లిమెంటులు ప్రతి రోజూ అందిస్తున్నాం. ఏనుగుల మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

జంతు సంరక్షణకు ప్రత్యేక ఏర్పాట్లు

కోసం వాటర్ ట్యాంకులను అందుబాటులో ఉంచాం. అడవి కుక్కల కోసం చల్లని నీటిని ఉంచాం. ఆవరణ చుట్టూ ఫైర్ సేఫ్టీ చర్యలు చేపట్టాం. వెటర్నరీ వైద్యుల సూచనల మేరకు వేసవిలో జంతువులకు అందించే ఆహారంలో మార్పులు చేశాం.

సందర్శకుల కోసం ఎలాంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు ?

వేసవి ప్రారంభం నుంచి జూ సందర్శకుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. హైవే ముఖద్వారం వైపు, సాగర ముఖద్వారం వైపు, చిరుతపులి ఎన్‌క్లోజర్ వద్ద, బయోస్కోపు వద్ద నాలుగు ఆర్‌ఒ ప్లాంట్లు అందుబాటులో ఉన్నాయి. చాలా చోట్ల శుద్ధి చేసిన తాగు నీరు అందుబాటులో ఉంది. మండుతున్న వేడి నుంచి ఉపశమనం పొందేందుకు పలు ప్రదేశాలలో పగోడాలు, విశ్రాంతి స్థలాలు ఉన్నాయి. సందర్శకులు కూర్చునేందుకు కొత్త సిటింగ్ బెంచీలు ఏర్పాటు చేశాం. వీటితో పాటు పార్కులో కొన్ని ప్రదేశాల్లో సందర్శకులు సేద తీరేందుకుగాను పెద్ద పెద్ద అంబ్రెల్లాలు ఏర్పాటు చేస్తున్నాం. ఇవి కాకుండా క్యాంటీన్ సౌకర్యం, ఐస్‌క్రీమ్ పార్లర్లు వంటివి ఉండనే ఉన్నాయి. సందర్శకులు జూ చుట్టూ తిరిగేందుకు బ్యాటరీ వాహనాలు, ఈ–బైక్‌లు అందుబాటులో ఉన్నాయి.

కొత్త జంతువులను తీసుకురావడానికి ఏమైనా ప్రయత్నాలు చేస్తున్నారా ?

జంతు మార్పిడి విధానం ద్వారా ఇప్పటికే కొత్త జంతువులను తీసుకొచ్చాం. ఈ విధానం ద్వారా మరిన్ని జంతువులను తీసుకు వచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. జంతువుల సంతానోత్పత్తి కోసం నిరంతర ప్రక్రియ జరుగుతోంది. అంతరించిపోతున్న రేస్ కుక్కలు, అడవి దున్నల సంతానం ఇక్కడి జూ పార్కులో ఆశాజనకంగా ఉంది.

జూపై పిల్లల్లో అవగాహన కల్పించేందుకు చేపడుతున్న చర్యలేంటి ?

వన్యప్రాణుల పట్ల చిన్నారులకు అవగాహన కల్పించేందుకు ఇందిరాగాంధీ జంతు ప్రదర్శన శాల పలు కార్యక్రమాలు చేపడుతోంది. వన్యప్రాణులకు సంబంధించిన ప్రత్యేక సందర్భాల్లో విద్యార్థులకు ఉచిత ప్రవేశాలు కల్పించి వ్యాసరచన, డ్రాయింగ్, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్నాం. అదేవిధంగా అవుట్ రీచ్ యాక్టివిటీలో భాగంగా జూ ఎడ్యుకేషన్ టీం ప్రతి పాఠశాలకూ వెళ్లి వన్యప్రాణుల గురించి అవగాహన కల్పిస్తోంది.

ఐకానిక్ సిటీ ఆఫ్ గోల్డ్‌లో అధునాతన సౌకర్యాలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రుషికొండ ఐటి హిల్ నెంబర్ 3 సమీపంలో 97 ఎకరాల్లో ఐకానిక్ సిటీ ఆఫ్ గోల్డ్ పేరిట టౌన్ షిప్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్టు ప్రమోటర్స్ కె.మురళీకృష్ణ, కె.సంతోష్ తెలిపారు. ఆదివారం హోటల్ డాల్ఫిన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ నెల 24న త్రిదండి చిన జీయరు స్వామి ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయనున్నట్టు వెల్లడించారు. మొదటి దశలో 4,500 నుంచి 10 వేల చదరపు అడుగుల విస్తీర్ణంగల 180 విల్లాలు నిర్మిస్తామని చెప్పారు. కమర్షియల్ కాంప్లెక్స్‌లు, కన్వెన్షన్ సెంటర్, ఫైవ్ స్టార్ హోటల్, ఐటి టవర్స్, ప్రీమియం అపార్ట్మెంట్స్ వంటి నిర్మాణాలు దశల వారీగా వస్తాయన్నారు. 45 వేల చదరపు అడుగుల్లో విశాలమైన క్లబ్ హౌస్ నిర్మిస్తున్నామని తెలిపారు. విశాఖ, తిరుపతిలలో ఫైవ్ స్టార్ హోటల్స్ అందుబాటులోకి తెస్తామన్నారు. తన సొంత రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో భారీగా పెట్టుబడులు పెట్టాలనే ఉద్దేశంతో విశాఖలో శ్రీ రామ్ ప్రాపర్టీస్ దగ్గర విల్లాల నిర్మాణం చేపట్టామని, ఎన్‌సిసికి చెందిన భూమిలో ఐకానిక్ సిటీ ఆఫ్ గోల్డ్ టౌన్ షిప్‌ను తీసుకువస్తున్నామని వివరించారు. రియల్ ఎస్టేట్ రంగంలో తమకు 25 ఏళ్ల సుదీర్ఘ అనుభవముందని, బెంగళూరులో గార్డెన్ సిటీ రియల్టర్స్ పేరుతోనూ, హైదరాబాద్‌లో సైబర్ సిటీ పేరుతోనూ వేలాది అపార్ట్మెంట్‌లు, విల్లాలు విక్రయించామని చెప్పారు. నిర్మాణ రంగంలో ప్రప్రథమంగా గ్రీన్ బిల్డింగ్ కాన్సెప్ట్ ప్రవేశపెట్టామన్నారు. ఈ సందర్భంగా ఐకానిక్ సిటీ ఆఫ్ గోల్డ్ బ్రోచర్‌ను ప్రదర్శించారు.

బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మురళీకృష్ణ, సంతోష్



బీచ్‌లో ఏర్పాటు చేసిన చంద్రబాబు సైకత శిల్పం

ఆకట్టుకున్న చంద్రబాబు సైకత శిల్పం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 75వ జన్మదిన వేడుకలను వియంఆర్‌డిఎ చైర్మన్ ఎంవి.ప్రణవ్ గోపాల్ ఆధ్వర్యాన ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ క్రమంలో విశాఖ బీచ్ రోడ్డులోని ఎంజిఎం లాన్ సముద్ర తీరంలో ఇసుక తెన్నెలపై ఏర్పాటు చేసిన సైకత శిల్పం ఆకట్టుకుంది. దీన్ని సందర్శకులు ఆసక్తిగా తిలకించారు. సెల్ఫీలు దిగారు.

ఎట్టకేలకు డిఎస్‌సి

(మొదటి పేజీ తరువాయి..) పిఇటి పోస్టులు ఒక్కటి కూడా నోటిఫికేషన్‌లో లేవు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత డిఎస్‌సి నోటిఫికేషన్‌కు విద్యాశాఖ చేపట్టిన కసరత్తులో ఉమ్మడి విశాఖ జిల్లాలో పై ఖాళీలున్నట్టు విద్యాశాఖాధికారులు పాఠశాల విద్యాశాఖకు నివేదించారు.

భర్తీచేసే సంఖ్యలో తేడా లేనప్పటికీ సబ్జెక్టు ఉపాధ్యాయ ప్రతిపాదిత పోస్టులకు, నోటిఫికేషన్‌లో పేర్కొన్న ఉపాధ్యాయ ఉద్యోగాలకు స్వల్ప మార్పులున్నాయి. గత ప్రభుత్వం జారీచేసిన జిఒ 117ను రద్దుచేసి, అంతకు పూర్వపు పద్ధతిని పరిగణనలోకి తీసుకొని నోటిఫికేషన్ జారీచేసి వుంటే ఉపాధ్యాయ పోస్టుల భర్తీ సంఖ్య మరింత పెరిగే అవకాశముండేది.

ఉమ్మడి విశాఖ జిల్లాలో భర్తీ ఇలా..

ప్రభుత్వ :	ఎస్ఎ భాష–1	హిందీ	ఇంగ్లీష్	లెక్కలు	భౌతికశాస్త్రం	జీవశాస్త్రం	సాంఘికశాస్త్రం	ఎస్ఎ పిఇటి	ఎస్‌జిటి	మొత్తం
	26	28	55	59	39	58	91	139	239	734
ఆశ్రమ పాఠశాలలు										
	తెలుగు	హిందీ	ఇంగ్లీష్	లెక్కలు	భౌతికశాస్త్రం	జీవశాస్త్రం	సాంఘికశాస్త్రం	ఎస్ఎ పిఇటి	ఎస్‌జిటి	మొత్తం
	7	11	-	7	35	-	5	-	335	400

ప్రజల బాధలు పట్టవా ?

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

అటు కూటమి భాగస్వామ్య పార్టీలు, ఇటు వైసిపి అధికార పీఠ అవిశ్వాస పోటీలో దారితప్పి తిరుగుతూ ప్రజల బాధలను వదిలేశాయి. తమ పదవీ పెత్తనాలు, అధికార దర్పాలకు అవాంఛనీయ రాజకీయాలు నిస్సగ్గుగా చేస్తున్నాయి. అవిశ్వాసంలో విశ్వాసం పొందడానికి అక్ర, వక్రమార్గాలుపట్టి పదవి పొందాలని చూస్తున్నారేగానీ.. ప్రజల విశ్వాసంతో పనిలేనట్లు పెక్కు మంది ప్రజాప్రతినిధులు ప్రవర్తిస్తున్నారు. జివిఎంసిలో ప్రారంభమైన విశ్వాస రాజకీయాలు గ్రామీణ ప్రాంతంలోని యలమంచిలి మున్సిపాల్టీ వరకు వెళ్లాయి. విశాఖ నగర మేయర్ హరి వెంకటకుమారిపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గించుకున్నామని సరదాలో కూటమి వుంది తప్ప అందుకు అనుసరించిన నీచ రాజకీయాల నీడ తమను వెంటాడుతుందన్న విషయం గుర్తించినట్లులేదు. వైసిపి కార్పొరేటర్లు కొందరు టిడిపి, జనసేనలోకి జారిపోవడంతో బలం చాలక వైసిపి మేయర్ హరివెంకట కుమారి కుర్చీ దిగిపోవాల్సివచ్చింది. యలమంచిలి పురపాలక సంఘం ఛైర్‌పర్సన్ కుర్చీలో కూర్చొన్న రమాకుమారి సాధారణ ఎన్నికల అనంతరం వైసిపిని వీడి బిజెపిలో చేరడంతో ఆమెపై అవిశ్వాస తీర్మానం అక్కడ కౌన్సిలర్లు ప్రవేశపెట్టారు. ప్రస్తుత బలాబలాలు చూస్తే రమాకుమారి కుర్చీ వదిలిపెట్టేలా వుంది.

తన నియోజకవర్గంలోని విసిఐసి నిర్వాసితులు, అచ్యుతాపురం – అనకాపల్లి రోడ్డు విస్తరణ బాధితులు, ఉపాధి హామీ కూలీలు, చెరుకు రైతుల బకాయి సమస్యలను పట్టించుకోని అనకాపల్లి ఎంపీ సిఎం రమేష్... అవిశ్వాస తీర్మానంలో కూటమి విజయంపై సంబరపడుతున్నారు. తనను గెలిపించిన ప్రజలను వదిలేసి, పదవి కోసం పట్టువిడుపులు లేకుండా చేసే రాజకీయాల్లో ఆరితేరిన ఆయన విశ్వాస రాజకీయంలో భాగమై జివిఎంసిలో తన భాగం వెతుక్కుంటున్నట్లుంది.

ఎన్‌డిఎ ప్రభుత్వ వక్ఫ్ చట్ట సవరణ బిల్లుపై ముస్లింలు పెద్ద ఎత్తున నగరంలో తెలిపిన నిరసన రాబోయే కాలంలో ఆ బిల్లుకు మద్దతు తెలిపిన కూటమి పార్టీలకు వేయబోయే ముకుతాడు కానుంది. జిల్లాలో 2.89 లక్షల మంది ఉపాధి కూలీలకు జనవరి నుంచి కూలి బకాయి ప్రభుత్వం చెల్లించలేదు. పనులు చేసుకొని కుటుంబాలను పోషించుకొనే కూలీలకు బకాయిలు చెల్లించకపోతే వారెలా బతుకుతారన్న ఆలోచన ఎంపీ, ఎమ్మెల్యేలకు పట్టకపోవడం విచారకరం. రూ.52 కోట్లకుపైగా కూలీలకు ప్రభుత్వం బకాయిపడింది. చేసిన పనికి కూలి చెల్లించాలని సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం నేతృత్వంలో జిల్లా వ్యాపితంగా పని ప్రదేశాల్లో, మండల కేంద్రాల్లో కూలీలు చేస్తున్న ఆందోళన వీరి చెవికి వినిపించినట్లు లేదు. కళ్లకు కన్పించినట్లులేదు.

సముద్రంలో చేపల వేట నిషేధ కాలంలో చెల్లించాల్సిన పరిహారం గతేడాది నుంచి మత్స్యకారులకు అందేలా వీరు కనీస ప్రయత్నం చేయడంలేదు. కోటవురట్ల మండలం కైలాసపట్నంలో బాణ సంచాతయారీ కేంద్రంలో జరిగిన ప్రమాదంలో 8 మంది మృతిచెందినా ఇప్పటికీ ఆ తరహా ప్రమాదాల నియంత్రణకు, అనధికార తయారీ కేంద్రాలపై చట్టపరమైన చర్యలకు వెళ్లడంలేదు. అనధికార కేంద్రాల నిర్వాహకులు కూటమికి చెందిన వారు కావడంతో చూసీచూడనట్లు బాధ్యతకల్గినవారంతా తప్పించుకొని వెళ్లిపోతున్నారు. కూటమి పార్టీల ప్రజా ప్రతినిధులు ప్రజలనే కాదు, చివరకు తమ పార్టీకి చెందని జెడ్‌పిటిసిలను కూడా బాధపెట్టకుండా వదలడంలేదు. వారికి రావాల్సిన నిధులు వినియోగానికి ఎమ్మెల్యేలు అడ్డుపడుతున్నారని జిల్లా పరిషత్ సర్వ సమావేశంలో జెడ్‌పిటిసిలు మొరపెట్టుకోవాల్సిన పరిస్థితి వచ్చింది.

టికెఎం అర్బన్ క్రూయిజర్‌లో భద్రతకు ప్రాధాన్యత

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : టొయోటా కిర్లోస్కర్ మోటార్ (టికెఎం) అర్బన్ క్రూయిజర్ హైరైడర్‌లో భద్రత, సౌకర్యం సౌలభ్యాన్ని పునర్నిర్వచించే ఫీచర్ అప్‌గ్రేడ్‌లను ప్రవేశపెట్టినట్లు టికెఎం సేల్స్ సర్వీస్ యూజ్డ్ కార్ విభాగ హెడ్ వరీందర్ వాధ్వా మీడియాకు ఆదివారం తెలిపారు. భారతదేశపు మొట్టమొదటి సెల్ఫ్–ఛార్జింగ్ స్ట్రాంగ్ హైబ్రిడ్ ఎలక్ట్రిక్ ఎస్‌యువిగా గుర్తింపు పొందిన అర్బన్ క్రూయిజర్ హైరైడర్ ఇప్పటికే లక్ష వాహనాల అమ్మకాల మైలురాయిని దాటిందన్నారు. ఇది దాని వినూత్న సాంకేతికత, అసాధారణమైన ఇంధన సామర్థ్యం, ,శక్తివంతమైన పనితీరు, ప్రీమియం డ్రైవింగ్ అనుభవంతో హృదయాలను గెలుచుకుంటూనే ఉందన్నారు. అర్బన్ క్రూయిజర్ హైరైడర్‌లో ఇప్పుడు ప్రధానంగా మెరుగైన భద్రత ఫీచర్లు జోడించబడ్డాయన్నారు. ప్రయాణికుల భద్రతను నిర్ధారిస్తూ ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు అన్ని వేరియంట్‌లలో ప్రామాణికంగా ఉన్నాయని, అలాగే ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్‌కు ఎలక్ట్రానిక్ పార్కింగ్ బ్రేక్ జోడించబడిందని తెలిపారు.

విశాఖ మార్కెట్‌లోకి గెలాక్సీ ఎం56

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రముఖ ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ సామ్‌సంగ్ తమ విభాగంలోనే అత్యంత సన్నని స్మార్ట్‌ఫోన్ అయిన గెలాక్సీ ఎం 56 (5జి)ని విశాఖ మార్కెట్లోకి విడుదల చేసినట్టు సామ్‌సంగ్ ఇండియా ఎంఎక్స్ బిజినెస్ డైరెక్టర్ అక్షయ్ ఎస్.రావు తెలిపారు. ఒక హోటల్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రసిద్ధ గెలాక్సీ ఎం సిరీస్‌కి తాజాగా జోడించిన ఈ స్మార్ట్‌ఫోన్ వినియోగదారులకు ముందు, వెనుక రెండింటిలోనూ గొరిల్లా గ్లాస్ విక్టస్ ప్లస్ రక్షణ, ఒఐఎస్‌తో కూడిన 50 ఎంపి ట్రిపుల్ కెమెరా, 12 ఎంపి ఫ్రంట్ హెచ్ డిఆర్ కెమెరా, అధునాతన ఎఐ ఎడిటింగ్ సాధనాలతో ఉన్నతమైన స్మార్ట్‌ఫోన్ అనుభవాన్ని అందిస్తుందన్నారు. అర్థవంతమైన ఆవిష్కరణలను అందించడంలో తమ అచంచలమైన నిబద్ధతలో భాగంగా తాము గెలాక్సీ ఎం56 5జిని విడుదల చేయటానికి గర్విస్తున్నామన్నారు.

IN THE HON'BLE COURT OF THE II ADDL. DISTRICT JUDGE AT : VISAKHAPATNAM
O.S.238/2021

Between:
Smt. Sukhavasi Rajeswari & others ...Plaintiffs
And
Smt. Kadaraju Chellamma & others ...Defendants

SUMMONS

To,
D-5: Sri Kadaraju Srinu,
S/o. Sanyasi, Hindu, aged about 27 years, R/at Chinnayyapalem, Kusulivada, Anandapuram Mandal, Visakhapatnam Dist.

Please take notice that the above suit is filed by the plaintiffs for declaration and other reliefs against you and others and the same is posted to **05-05-2025** for your appearance on which date, you are required to appear before the above Hon'ble Court either in person or through your Advocate at **10.30 A.M.**, failing which you will be set exparte and the matter will be decided in your absence on merits.

(By Order)
M/s. DDM &Co.,
SRINIVAS AJJARAPU
Advocates
Near District Court,
Visakhapatnam

Visakhapatnam
Dt. 20-04-2025

అరకొర వసతులు

- స్థలం కేటాయించినా ప్రారంభం కాని పనులు
- ఆరేళ్లుగా విద్యార్థులు ఎదురుచూపులు
- ఇదీ ఆనందపురం జూనియర్ కాలేజీ దుస్థితి

జిల్లా పరిషత్ పాఠశాలలో నడుస్తున్న జూనియర్ కళాశాల

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2019లో తాత్కాలికంగా ఏర్పాటుచేసిన ఇంటర్మీడియట్ విద్య నేటికీ పూర్తిస్థాయిలో భవనాలు, ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులు చదవడానికి ఆసక్తి చూపడం లేదు. ఆనందపురం బాలికల వసతిగృహం పక్కన ఇంటర్మీడియట్ కళాశాల ఏర్పాటుకు స్థలం కేటాయించారు. పనులు ప్రారంభం కాకపోవడంతో ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోనే తాత్కాలికంగా కొనసాగుతోంది. పైఅంతస్తులోని రెండు గదులు కేటాయించడంతో అవి చాలక అవస్థలు పడుతున్నారు. అదే పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ప్రస్తుతం ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థుల పరిస్థితిని చూసి ఆ కాలేజీలో చదవడానికి ఆసక్తి చూపడం లేదు. ఇక్కడ ఎంపిసి, బైపిసి, సిఇసి, హెచ్ఇసి, ఎంఎల్‌టి కోర్సులు అందుబాటులో ఉన్నాయి. కానీ పర్మినెంట్ ఉపాధ్యాయులు, తరగతి గదులు లేవు.

2024 -25 సంవత్సరంలో 12 మంది విద్యార్థులకు ఏడుగురు ఉత్తీర్ణత సాధించి జిల్లాలోని ప్రభుత్వ కళాశాలలో రెండవ స్థానం సాధించినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. కళాశాలను ప్రారంభించి ఆరు సంవత్సరాలైనా పక్కా తరగతి గదులు ఏర్పాటుచేయకపోవడం, పర్మినెంట్ అధ్యాపకులను నియమించకపోవడంతో చదవడానికి ఆసక్తి చూపక ప్రైవేట్ కళాశాలలను ఆశ్రయించాల్సి వస్తుందని పలువురు చెబుతున్నారు. ఇప్పటికైనా కాలేజీకి పక్కా తరగతి గదులు ఏర్పాటుచేసి, పర్మినెంట్ అధ్యాపకులను నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

నేరాలు ఘోరాలు

మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి-పెందుర్తి: అనారోగ్య కారణాలతో ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధి చినముసిడివాడ శ్రమశక్తినగర్‌లో ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. రైల్వే ట్రాక్ సమీపంలో నివాసముంటున్న తువాల స్వర్ణలత (61) ఐదంతస్తుల మేడ నుంచి కిందకు దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. వరుసగా అనారోగ్య సమస్యలు చుట్టుముట్టడంతో ఆమె ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పెందుర్తి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

కుట్టు శిక్షణా కేంద్రం ప్రారంభంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, కార్పొరేటర్ హేమలత తదితరులు

కుట్టు శిక్షణా తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి-కొమ్మాది: జివిఎంసి 5వ వార్డు పరిధి మారికవలస సైక్లోన్ సెంటర్ భవనంలో బీసీ కార్పొరేషన్ స్వయం ఉపాధి కార్యక్రమంలో భాగంగా మహిళలకు కుట్టు మిషన్ శిక్షణా తరగతులను కార్పొరేటర్ మొల్లి హేమలతతో కలిసి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి అహర్నిశలు శ్రమించే బహుముఖ ప్రజ్ఞాశాలి ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. అనంతరం చంద్రబాబు జన్మదినం సందర్భంగా కేక్ కట్‌చేశారు. పండ్లు పంపిణీచేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మొల్లి లక్ష్మణరావు, నాగోతి వెంకట సత్యనారాయణ, ఈగల రవికుమార్, బోయి వెంకటరమణ (శ్రీను), నమ్మి శ్రీనివాస్, బోయ రమాదేవి, కొండపు రాజు, ముచ్చి రామనాయుడు, జనసేన నాయకులు దేవర శివ, ఆనందరావు, గురయ్యా శ్రీను, గురయ్యా రెడ్డి, కురుమోజు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

హోమియో మందుల పంపిణీ

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక కలిగొట్ల స్నిగ్ధశ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యాన ఫౌండేషన్ కార్యాలయం వద్ద ఆదివారం ఏర్పాటుచేసిన ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని ఫౌండేషన్ చైర్మన్ కె శ్రీరామచంద్రమూర్తి ప్రారంభించారు. సుమారు 95 మందిని వైద్యులు టి.జగన్నాథరావు, టిజె.మోహన్ పరీక్షించి హోమియో మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు కెఎస్ఎన్.మూర్తి, కె.చంద్రశేఖర్, కెవి.భానోజీరావు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో అందుబాటులోకి వాణిజ్య సముదాయం

త్వరలో అందుబాటులోకి రానున్న వాణిజ్య సముదాయం ఇదే

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక మెయిన్ రోడ్డులో జివిఎంసి నిధులు సుమారు రూ.2 కోట్లతో నిర్మించిన వాణిజ్య సముదాయం త్వరలోనే అందుబాటులోకి రానుంది. దాదాపు 40 ఏళ్ల క్రితం మున్సిపాలిటీ ఆధ్వర్యాన ఇక్కడ నిర్మించిన వాణిజ్య సముదాయం శిథిలావస్థకు చేరడంతో సుమారు మూడేళ్ల క్రితం దుకాణాలను కూల్చేశారు. రెండేళ్ల క్రితం దుకాణ సముదాయం నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టి 11 దుకాణాలను నిర్మించారు. ఆయా దుకాణాలను వేలం పాట ద్వారా కేటాయిస్తామని, దుకాణ సముదాయం ముందు భాగంలో వాహనాల పార్కింగ్‌కు చర్యలు తీసుకుంటామని పబ్లిక్ వర్క్స్ సహాయ ఇంజినీర్ జి.సురేష్ తెలిపారు. కూరగాయలు, చేపలు అమ్మకాల కోసం దుకాణ సముదాయం వెనుక భాగంలో సుమారు 30 షెడ్లు నిర్మాణం చేపట్టారు.

జ్యూట్ కార్మికులకు బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి -తగరపువలస : చిట్టివలస జ్యూట్ మిల్లు కార్మికులకు పిఎఫ్, ఇతరత్రా బకాయిలను చెల్లించాలని కాకాస నాయకులు దల్లి అప్పలరెడ్డి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇదే విషయమై పలు దఫాలుగా జెసిఎల్‌తో చర్చించినప్పటికీ పరిష్కారం కాలేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు జోక్యం చేసుకుని జ్యూట్ కార్మికులకు రావాల్సిన పిఎఫ్ ఇతర బకాయిలను చెల్లించేలా యాజమాన్యంపై ఒత్తిడి పెంచాలని విజ్ఞప్తి చేశారు.

అలరించిన నృత్యాలు

ప్రజాశక్తి -మధురవాడ : శిల్పారామం జాతరలో వారంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం నిర్వహించిన జోష్ డాన్స్ అకాడమీ చిన్నారుల నృత్య ప్రదర్శన అలరించింది. ముందుగా జైజనార్దన, ఐగిరినందిని, బుజ్జి గణపతి, ఎంత ముద్దుగుందో, జగడపుతనముల జాతర వంటి గేయాలకు పవిత్ర, మోక్ష జ్ఞాన, లక్ష్మీప్రణతి, జాస్మిక, గీతామిత్రా చేసిన నృత్యాలు అలరించాయి.

శిల్పారామంలో నృత్య ప్రదర్శనలు

చలివేంద్రాలు ప్రారంభం

మాధవ యువజన సమాజం ఆవరణలో....

ప్రజాశక్తి-యంత్రాంగం

మాధవధార : ప్రముఖ సంఘ సేవకులు కీర్తిశేషులు సనపల సూర్యనారాయణ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు సనపల శ్రీకాంత్ ఆర్థిక సహాయంతో కళింగ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన శ్రీ మాధవ యువజన సమాజం ఆవరణలో చలివేంద్రాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా 50వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సనపల వరప్రసాద్ మాట్లాడుతూ, విశాఖ నగరంలో మాధవధార కళింగ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ మంచి సేవా సంస్థగా గుర్తింపు పొందిందన్నారు. నిరంతరమూ ఎటువంటి లాభాపేక్షా లేకుండా సేవ చేయడం గర్వించదగ్గ విషయం అన్నారు. వాహనదారులకు, పాదచారులకు ఈ చలివేంద్రం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. మాధవధార కళింగ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపకులు సనపల శ్రీకాంత్, అధ్యక్షులు నంబాల ఈశ్వరరావు మాట్లాడుతూ, ఈ చలివేంద్రం రెండు నెలలుపాటు నిర్విరామంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పేడాడ రమణికుమారి, మాధవ యువజన సమాజం కన్వీనర్ సనపల రామ్‌గోపాల్‌రావు, కంచరాన సూర్యనారాయణ, తమ్మినేని పద్మజ, గ్రామ ప్రజలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్రెడాయ్ ఆధ్వర్యాన..

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కాన్ఫెడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్స్ ఆఫ్ ఇండియా (క్రెడాయ్) మహిళా విభాగం, లయన్స్ క్లబ్ ఆఫ్ విశాఖపట్నం సహకారంతో క్రెడాయ్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని క్రెడాయ్ విశాఖ చైర్మన్ వి.ధర్మేందర్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండ వేడిని తట్టుకునేందుకు మజ్జిగ పంపిణీ కేంద్రం ఏర్పాటు చేసిన క్రెడాయ్ మహిళా విభాగం బృందం కృషిని అభినందించారు. క్రెడాయ్ మహిళా విభాగం సమన్వయకర్త ఎస్.భారతి, కార్యదర్శి డి.ప్రణతి మాట్లాడుతూ ఈ చలివేంద్రం ద్వారా నగరంలో ప్రజలకు చల్లని మజ్జిగను అందించనున్నామన్నారు. బుధవారం వరకు పంపిణీ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. యువజన విభాగం కో-ఆర్డినేటర్ పవన్ సంక, కమిటీ సభ్యులు గణపతిరాజు, రాజేష్, కిరణ్ కుమార్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

క్రెడాయ్ కార్యాలయం వద్ద...

వివేకానంద నగర్‌లో..

8వ వార్డు వివేకానంద నగర్ జివిఎంసి పార్క్ వద్ద వివేకానంద నగర్ పీపుల్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం చలి వేంద్రం ప్రారంభించారు. వార్డు కార్పొరేటర్ లొడగల అప్పారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మజ్జిగ, మంచినీరు పంపిణీని ప్రారంభించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు, సభ్యులు కెఆర్‌కె.మూర్తి, రాంబాబు, రాఘవ, ఎన్.మధుసూధన్ రెడ్డి, టి.నాగేశ్వరరావు, దొరబాబు, మురళీకృష్ణ, ప్రకాష్, వెంకటేశ్వరరావు, శ్రీనివాస్, పెద్దిరాజు, అప్పారావు పాల్గొన్నారు.

వివేకానందనగర్ పార్కులో....

జోగవానిపాలెంలో పర్యటిస్తున్న సిపిఎం నాయకులు

సూపర్ సిక్స్ పథకాలు అమలుచేయాలి

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 67వ వార్డు పరిధి జోగవానిపాలెంలో సిపిఎం ప్రజా చైతన్య యాత్రను ఆదివారం చేపట్టింది. జోగవానిపాలెం, హైస్కూల్‌రోడ్డు, విద్యుత్ సబ్‌స్టేషన్ పశ్చిమ భాగం, బొజ్జన్నకొండ తూర్పు భాగంలో సిపిఎం నాయకులు పర్యటించారు. ప్రజలు వారి వారి సమస్యలను సిపిఎం నాయకులకు వివరించారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు కాలేదని, నిత్యావసర సరుకులు ధరలు, విద్యుత్ భారాలు పెరిగాయని, తల్లికి వందనం స్కీమ్ అమలుకావడంలేదని, ఉన్నత చదువులు చదువుతున్న విద్యార్థులకు ఫీజు రియంబర్స్‌మెంట్ చెల్లించలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో 67వ వార్డు సిపిఎం కార్యదర్శి పాలూరు లక్ష్మణరావు, నాయకులు కిరీటం, కె.ప్రతాప్ కుమార్, కె.సంతోష, కల్యాణి, కృష్ణకుమారి, లోకేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

'ప్రజాచైతన్యయాత్ర' సమస్యలపై నేడు ధర్నా

ప్రజాశక్తి -ములగాడ : సిపిఎం మల్కాపురం జోన్ కమిటీ ఆధ్వర్యాన ప్రజా చైతన్య యాత్ర సర్వేలో వచ్చిన ఇళ్ల పట్టాలు, ఉచిత గ్యాస్ సమస్యలపై సోమవారం 10 గంటలకు ములగాడ తహశీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టే ధర్నాలో లబ్ధిదారులందరూ పాల్గొనాలని సిపిఎం మల్కాపురం జోన్ కార్యదర్శి పి.పైడిరాజు కోరారు. జిఒలు 296, 388 ప్రకారం గల ఇళ్ల పట్టాలను రిజిస్ట్రేషన్ చేసుకోనేలా జిఒ విడుదల చేయాలని, ఉచిత గ్యాస్ పథకాన్ని అర్హులందరికీ అమలు చేయాలని చేపట్టే ధర్నాలో ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

శాస్త్రీయ పద్ధతులు అలవాటు చేసుకోవాలి

ప్రజాశక్తి -గాజువాక : పిల్లలు శాస్త్రీయ పద్ధతులను అలవాటు చేసుకోవాలని డాక్టర్ ఎం.రమేష్‌కుమార్ సూచించారు. గాజువాకలో విసిసి సమ్మర్ క్యాంప్ నిర్వహణకు సంబంధించి ఆయన నివాసంలో ఆదివారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విసిసి చేపడుతున్న వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కన్వీనర్ కె.సుశీల మాట్లాడుతూ, వినోదంతో పాటు విజ్ఞానం కూడా అందించాలని ఉద్దేశంతో వేసవిలో క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్యాంపుల ద్వారా నివాస ప్రాంతాల్లో పిల్లల మధ్య స్నేహం పెరిగి, మొబైల్‌కు దూరంగా ఉంటారని పేర్కొన్నారు. తెనాలికి చెందిన జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర సైన్స్ అండ్ టెక్నాలజీ నాయకులు రాయపాటి శివ నాగేశ్వరరావు పాల్గొని రోజూ ఉపయోగించే వస్తువులు, మన చుట్టూ ఉన్న వాటితో సైన్స్ ప్రయోగాలు చేసి చూపించి నేర్పించారు. దీని కోసం కిట్ తయారు చేశారు. అందరికీ చేసి చూపించి పిల్లల చేత చేయించారు. ఈ వర్క్ షాప్‌లో ఓరిగామి, టీం గేమ్స్, మెమరీ గేమ్స్, ఓల్డ్ గేమ్స్, కమ్యూనికేషన్స్ గేమ్స్, పాటలు కూడా నేర్పించారు. ఈ కార్యక్రమంలో జోన్ కన్వీనర్ అప్పారావు, ఆర్గనైజర్లు స్వర్ణలత, సంతోషం, వర్షిణి, కృష్ణవేణి, బాల, ధనుష్, ధాన్ ఫౌండేషన్ సభ్యులు సరోజిని, యమున పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ రమేష్‌కుమార్

ప్రభుత్వ విధానాల వల్లే కార్మికులకు కష్టాలు

సిఐటియు అఖిల భారత అధ్యక్షులు హేమలత

ప్రజాశక్తి -గోపాలపట్నం : ప్రభుత్వ విధానాల వల్లనే ప్రజలు, కార్మిక వర్గం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వీటిని ఎదుర్కోవడం కోసం భారత కార్మిక వర్గం చేస్తున్న పోరాటాలను అణిచివేయడం కోసమే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం లేబర్ కోడ్స్ తీసుకొచ్చిందని సిఐటియు అఖిల భారత అధ్యక్షులు డాక్టర్ కె.హేమలత పేర్కొన్నారు. ఎన్ఎడి కొత్త రోడ్డు దగ్గర డిఫెన్స్ కో-ఆర్డినేషన్ కమిటీ నూతన కార్యాలయాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా 'లేబర్ కోడ్స్ -కార్మిక హక్కులు- పోరాటాలపై ప్రభావం' అన్న అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆమె మాట్లాడుతూ, సరళీకరణ విధానాలు ప్రారంభమైన తర్వాత దేశ సంపదను కార్పొరేట్లకు అప్పనంగా ధారపోస్తున్నారని తెలిపారు. కనీస హక్కులకు తీవ్రమైన భంగం కలుగుతుందన్నారు. పర్మినెంట్ ఉద్యోగాల స్థానంలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలు పెరిగాయని, వారికి కనీస వేతనాలు కాదు, హక్కులు లేకుండా చేస్తున్నారని తెలిపారు. పరిశ్రమలలో భద్రత కరువైందని, వీటిని ప్రశ్నిస్తే ఉద్యోగాల నుంచి తొలగించడంతోపాటు కేసులు పెట్టి వేధిస్తున్నారని చెప్పారు. ఈ కాలంలో సమైక్య పోరాటాలు పెరిగాయని, ఈ పోరాటాలు జరగకుండా చేయడం కోసమే బ్రిటీష్ కాలం నుంచి భారత కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దుచేసి కార్మిక కోడ్స్ పేరుతో పెట్టుబడిదారులకు ఊడిగం చేసే మార్పులు తీసుకొచ్చారని విమర్శించారు. ప్రభుత్వ విధానాలతో పాటు, పెట్టుబడిదారులను ప్రశ్నించకుండా చేయడమే కార్మిక కోడ్స్ ఉద్దేశమని తెలిపారు. వీటిని పార్లమెంట్‌లో ఆమోదించుకున్నా అమలు చేసే ధైర్యం కేంద్ర ప్రభుత్వం చేయలేకపోతుందని, దానికి కారణం కార్మిక కోడ్స్‌కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా కార్మిక వర్గం పోరాటంలోకి రావడమేనని పేర్కొన్నారు. 2025 ఏప్రిల్ 1వ తేదీ నుంచి లేబర్ కోడ్స్ అమలు జరుపుతామని ప్రభుత్వం ప్రకటించగానే కార్మిక సంఘాలన్నీ ఏకమై సదస్సు నిర్వహించి మే 20న దేశవ్యాప్త సమ్మె జరపాలని నిర్ణయించాయని, ఈ సమ్మెకు భారత రైతాంగం సంఘీభావం తెలియజేయడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో బంద్ నిర్వహించాలని నిర్ణయించాయని తెలిపారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా జరుగుతున్న ఈ సమ్మెలో భారత కార్మికవర్గంతో పాటు రక్షణ రంగం కార్మికులు పాల్గొంటే బాగుండేదని పేర్కొన్నారు. సంఘీభావ కార్యక్రమాల్లో పాల్గొని ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు.

డిఫెన్స్ కో-ఆర్డినేషన్ కమిటీ కార్యాలయానికి ఇంటిని ఇచ్చిన ఆంధ్ర యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ పి.రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ మోటూరి హనుమంతరావు, ఉదయం సాన్నిహిత్యంతో పెరిగానని, వారి భావాలు తనకు చాలా ఇష్టమని అందుకే కార్మిక వర్గ శ్రేయస్సు కోసం పనిచేస్తున్న వారికి ఇంటిని అద్దె తీసుకోకుండా ఉచితంగా ఇస్తున్నానని తెలియజేశారు. అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తానని హామీ ఇచ్చారు. సదస్సుకు అధ్యక్షత వహించిన రెడ్డి వెంకటరావు మాట్లాడుతూ, లేబర్ కోడ్స్ అమలులో లేకపోయినా మోడీ ప్రభుత్వం రక్షణ రంగంలో సమ్మెలు నిషేధించి, కార్మిక హక్కులపై దాడి చేస్తోందని చెప్పారు. కోర్టు కేసులు గెలుచుకున్నా అమలు కాకుండా పోతున్నాయని, సస్పెన్షన్లు వార్నింగ్ లెటర్స్ నిత్య కృత్యమయ్యాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఇటీవల కాలంలో యుపిఎస్‌పై అవగాహన కల్పించడం కోసం జరిగిన సదస్సు, ప్రభుత్వ విధానాల వల్ల రిజర్వేషన్లు కలుగుతున్న నష్టాన్ని తెలియజేస్తూ జరిగిన సదస్సు, ఈ సదస్సు ద్వారా విశాఖ రక్షణ రంగ కార్మిక వర్గాన్ని చైతన్యవంతం చేయడం కోసం చేస్తున్న కృషిని వివరించారు.

కాన్ఫిడరేషన్ ఆఫ్ సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.నాగేశ్వరరావు మాట్లాడుతూ, ఓపిఎస్ సాధన కోసం, 8వ వేతన సంఘం నియామకం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాజేష్, అరుణ్, కె.శ్రీనివాసరావు, ఆర్.శ్రీనివాస్, సునీల్, ఎస్.వెంకట్రావు, దీన్ అహ్మద్, కె.నాగార్జునరావు పాల్గొన్నారు.

కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న హేమలత

ఆరోగ్య సంరక్షణ అందరి బాధ్యత

ఇసిజి పరీక్ష చేస్తున్న వైద్య సిబ్బంది

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : అంతర్జాతీయ సహకార సంవత్సరం 2025ను పురస్కరించుకుని కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకు, జాయింట్ రిజిస్ట్రార్/ జిల్లా సహకార అధికారి సంయుక్త ఆధ్వర్యాన ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అక్కయ్యపాలెంలోని బ్యాంకు ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ఈ శిబిరంలో ఖాతాదారులతో పాటు చుట్టు పక్కల ప్రజలు, బ్యాంకు సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు పాల్గొని ఉచిత కంటి, దంత, బీపీ, సుగర్, రక్త పరీక్షలు, ఈసిజి తదితర వైద్య పరీక్షలను నిర్వహించుకున్నారు. ముఖ్యఅతిథిగా ప్రాంతీయ సహకార అధికారి దుర్గాప్రసాద్, సహాయ సహకార అధికారి సత్యవేణి, బ్యాంకు వైస్ ఛైర్మన్ జి.రామకృష్ణ, డైరెక్టర్ బి.నాగేశ్వరరావు హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం దుర్గాప్రసాద్ మాట్లాడుతూ, ప్రస్తుత రోజుల్లో ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలన్నారు. ప్రస్తుతం తినే తిండి, వాతావరణం కారణంగా అనేక ఊహించని రోగాలు సంభవిస్తున్నాయని, ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకొని, సకాలంలో మందులను వినియోగించాలని సూచించారు. బ్యాంకు వైస్ ఛైర్మన్ జి.రామకృష్ణ మాట్లాడుతూ, ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం సాఫీగా జీవనాన్ని సాగించగలదని చెప్పారు. తమ బ్యాంకు సేవా కార్యక్రమాల్లో భాగంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. శిబిరంలో పాల్గొన్న అధికారులకు, వైద్య సిబ్బందికి మొక్కలను బహూకరించారు. సహాయ సహకార అధికారిణి సత్యవేణి మాట్లాడుతూ, అంతర్జాతీయ సహకార సంవత్సరం గురించి వివరించారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 3 గంటల వరకు జరిగిన ఈ శిబిరంలో సుమారు 450 మందికిపైగా పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనుభవజ్ఞులైన వైద్యులచే ఆహార నియమాల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు ముఖ్యకార్యనిర్వాహణాధికారి కె.శ్యామ్‌కిషోర్, పినాకిల్, మ్యాక్సివిజన్ ఐ హాస్పిటల్ల వైద్యులు డాక్టర్ కృష్ణసాయి, డాక్టర్ దుర్గాప్రసాద్, డాక్టర్ హారిక, డాక్టర్ రిషిత, డాక్టర్ సాయికృష్ణ, డాక్టర్ భార్గవ్, డాక్టర్ సునీత, సిబ్బంది సోమశేఖర్, సురేష్, సతీష్, ఇతర బ్యాంకు సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

స్కూలు విద్యార్థులతో ముకుందరావు

డ్రాయింగ్ పోటీలు

ప్రజాశక్తి -మాధవధార : ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యాన డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో నగరంలోని లిటిల్ ఏంజెల్స్, ప్రెసిడెన్షియల్ స్కూల్, కేంద్రీయ విద్యాలయం, శివశివాని, శ్రీశిష్ట స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ ముకుందరావు మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి కాలుష్యాన్ని నియంత్రించాలని కోరారు. కాలుష్య నియంత్రణపై విద్యార్థులకు అవగాహన కోసం ఈ డ్రాయింగ్ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. చిన్ననాటి నుండే కాలుష్యంపై విద్యార్థులకు అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఈ నెల 22వ తేదీన బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రయూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ ఉదయభాస్కర్‌రెడ్డి, కాలుష్య నియంత్రణ మండలి సిబ్బంది పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ టూ వీలర్ షోరూమ్ ప్రారంభం

ప్రజాశక్తి-సీతమ్మధార: కంచరపాలెం మెయిన్‌రోడ్డు ఊర్వశి జంక్షన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన మహదేవ్ ఇవి ఎలక్ట్రికల్ టు వీలర్ షోరూమ్‌ను పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం.నాగసుధ, సేనాపతి సోమశేఖర్, రాపర్తి కిషోర్, రాపర్తి నందు, మడక గౌరి, మహదేవ్ ఇవి ఎలక్ట్రికల్స్ టూ వీలర్ షోరూం యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు

ప్రజాశక్తి -తగరపువలస : ఈ నెల 14 న ప్రారంభమైన అగ్నిమాపక వారోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. వారోత్సవాల ముగింపు సందర్భంగా చిట్టివలస అగ్ని మాపక శాఖ కార్యాలయం వద్ద అగ్ని మాపక పరికరాలను ప్రదర్శించారు. వాటి వినియోగంపై స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఫైర్ ఆఫీసర్ జి.శ్రీనివాసరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

అగ్నిమాపక పరికరాల వినియోగంపై అవగాహన కల్పిస్తున్న ఆ శాఖ సిబ్బంది

పార్కు పనుల్లో నాణ్యతకు చెల్లుచీటి

- నిర్మాణ సమయంలోనే డొల్లతనం
- చోద్యం చూస్తున్న అధికారులు
- సిపిఎం నేత వెంకన్న ధ్వజం

దేవరాపల్లిలో విఎంఆర్‌డిఎ ఆధ్వర్యాన నిర్మాణంలో ఉన్న పార్కు

ప్రజాశక్తి- దేవరాపల్లి: మండల కేంద్రంలో విఎంఆర్‌డిఎ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న పార్క్ నిర్మాణంపై సమగ్ర విచారణ జరిపించాలని, నాణ్యత ప్రమాణాలు పాటించని వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు డి వెంకన్న కోరారు. ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ, పార్క్ నిర్మాణంలో నిదులు దుర్వినియోగం జరుగుతోందన్నారు.

పార్క్ నిర్మిస్తున్న స్థలం కోట్లాది రూపాయలు విలువైనదని తెలిపారు ,దేవరాపల్లి గ్రామానికి పలు విద్యాసంస్థలు వచ్చినా వాటికి స్థలం సమకూర్చలేని స్థితిలో వేరే ప్రాంతానికి తరలిపోవడమో,లేకుంటే నిర్మాణాలు ఆగిపోవడమో జరిగిన పరిస్థితుల్లో ప్రజల ఆటవిడువు, విశ్రాంతి కోసం నిర్మిస్తున్న పార్కు పనుల్లో నాణ్యత లోపిస్తే ప్రయోజనమేంటని ప్రశ్నించారు . దేవరాపల్లికి గతంలో నవోదయ పాఠశాల మోడల్ స్కూల్, స్పోర్ట్స్ స్కూల్ లాంటి విద్యాసంస్థలు మంజూరు కాగా, స్థలం సమకూర్చలేని స్థితిలో వేరే ప్రాంతానికి వెళ్ళిపోయాయన్నారు. ప్రస్తుతం స్థలం ఇస్తే డిగ్రీ కాలేజీ నిర్మాణం చేస్తామని ప్రభుత్వ చెబుతోందని, రూ. రెండు కోట్లు ఖర్చుతో హస్టల్ భవనాలు మంజూరుకాగా, స్థలాభావంతో హైస్కూల్‌లోనే వాటి నిర్మాణం జరుగుతోందన్నారు ఇన్ని విలువైన పాఠశాలలు వదులుకుని, కోట్లాది రూపాయలు విలువైన స్థలంలో పార్క్ నిర్మాణం జరుగుతున్నపుడు ఆ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పూర్తిగా పాటించకుండా నిధులు దుర్వినియోగానికి పాల్పుడుతున్నారని మండిపడ్డారు. రూ. 22 లక్షలతో చేపాడుతున్న ట్రాక్ పనులు రోలింగ్ లేకుండా ఇష్టానుసారం నిర్మిస్తున్నారని, రూ. 40 లక్షలతో ప్రహరీ, రూ.52 లక్షలతో మినీహల్ నిర్మాణం జరుగుతుండగా, ఆయా పనుల్లోనూ నాణ్యతాప్రమాణాలు పాటించడం లేదనే ఆరోపణలున్నాయన్నారు. సిమెంట్ పనుల్లో వాటరింగ్ చేయకుండా పనులు సాగిస్తున్నా, వాటినిపర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు, వెంటనే ఉన్నతాధికారులు స్పందించి పార్కు అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించే విదంగా చర్యలు తీసుకోవాలని, దీనిపై సమగ్రమైన దర్యాప్తు జరపాలని వెంకన్న డిమాండ్ చేసారు,

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని నంగినారపాడు హైస్కూల్ 2000-01 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో వారంతా కలుసుకుని, ఒకరినొకరు పలకరించుకున్నారు. చదువుకున్నప్పటి పాత జ్ఞాపకాలు గుర్తు చేసుకుని, సందడిగా గడిపారుఇక నుంచి ఏటా తామంతా ఇలా పాఠశాల ఆవరణలో కలుసుకోవాలని నిర్ణయించుకున్నారు. అనంతరం పూర్వ విద్యార్థులు సహపంక్తి భోజనాలు చేశారు.

నూకాంబిక సన్నిధిలో జెసి దంపతులు

జెసి దంపతులను సత్కరిస్తున్న గొల్లబాబు, ఉత్సవ కమిటీ సభ్యులు

ప్రజాశక్తి- అనకాపల్లి : గవరపాలెం నూకాంబిక అమ్మవారిని ఆదివారం ఎపిఇపిడిసిఎల్ మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీ తేజ్, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి దంపతులు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు వారికి సాదరంగా స్వాగతించారు. ప్రత్యేక పూజలు అనంతరం ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదం అందజేయగా, ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగ శ్రీను (గొల్లబాబు) అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్, ఆలయ ఈవో వెంపల్లి రాంబాబు, ఆలయ ధర్మకర్తలు సూరే సతీష్,దాడి రవికుమార్,పొలిమేర ఆనంద్, మారిశెట్టి శంకర్రావు, కాండ్రేగుల రాజారావు, మజ్జి శ్రీనివాసరావు, కొడుకుల శ్రీకాంత్, వడ్డాది మంగ, కోనేటి సూర్యలక్ష్మి, ఎర్రవరపు లక్ష్మి, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

బోరుబావికి శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్

ప్రజాశక్తి- కె.కోటపాడు : వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు అధిక ప్రాధాన్యతనిచ్చిన అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు గ్రామ సర్పంచి దాడి ఎరుకు నాయుడు అన్నారు. చౌడువాడ శివారు మల్లంపాలెం గ్రామంలో ఆదివారము గ్రామపంచాయతీ నిధులతో రెండు తాగునీరు బోర్లు రూ.2.50 లక్షలతో గ్రావెల్ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో తాగునీరు. పారిశుధ్యం, వీధిలైట్ల సమస్య ఎక్కడ తలెత్తకుండా ప్రత్యేక శ్రద్ధతో చర్యలు చేపడుతున్నా మన్నారు. పంచాయతీ పరిధిలో అవసరం ఉన్నచోట సిమెంట్ రోడ్లు. సిమెంట్ కాలువలు. ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తెస్తే,వెంటనే పరిష్కారం చర్యలు చేపడతానన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి రంగలి సూర్యనారాయణ. ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్. కాలువ చైర్మన్ నాగరాజు. విశ్రాంత ఉపాధ్యాయులు గోవిందరావు పాల్గొన్నారు.

ఆత్మహత్యలు ప్రత్యామ్నాయం కాదు

- విద్యార్థులకు అవగాహనలో డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ సీతాలక్ష్మి

మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సీతాలక్ష్మి

ప్రజాశక్తి- సబ్బవరం : పరీక్ష తప్పిందని, తక్కువ మార్కులు వచ్చాయని, ప్రేమ విఫలమైందని, ఎవరో మందలించారని ఇలా సాదారణ, చిన్నచిన్న కారణాలతో ఆత్మహత్యలు చేసుకోవడం సరికాదని, సమస్యలకు ఆత్మహత్యలే పరిష్కారం, ప్రత్యామ్నాయం కాదని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల పిన్సిపల్ డాక్టర్ బి సీతాలక్ష్మి అన్నారు. శుక్రవారం ఆత్మహత్య చేసుకున్న కాలేజీలోని మొదటి సంవత్సరం బిఎ విద్యార్థి కర్రి అప్పలనాయుడు మృతికి సంతాపంగా అతని ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూకళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు,విద్యార్థులు, రెండు నిమిషాల మౌనాన్ని పాటించారు. విద్యార్థి అప్పలనాయుడుతో ఉన్న జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ, యుక్త వయసులో విద్యార్థులకు కలిగే వ్యామోహం, ప్రేమ ఒకటి కాదని, చదువే అన్నిటికీ చక్కని పరిష్కారాన్ని ఇస్తుందన్నారు. ప్రతిఒక్కరూ బాగా చదువుకుని భవిష్యత్‌ను చక్కదిద్దుకోవాలని, తర్వాతే ఇతర వ్యవహారాలవైపు వెళితే అప్పటికే వారిలో కలిగే పరిపక్వతతో ఆత్మహత్యలు వంటి ఘటనలు చోటుచేసుకోవన్నారు. ఒక మరణం వెనక కుటుంబం శోకం, ఒక మిత్రుని బాధ, సమాజానికి తీరని లోటు ఉంటుందని, విద్యార్థులెవరూ బలవన్మరణాలకు పూనుకోవద్దని హితవు పలికారు కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, డాక్టర్ వివి గోపాలకష్ణ, డాక్టర్ ఎం రత్న ప్రకాష్, ఎం గోవిందరావు కె ప్రభుదాసు పాల్గొన్నారు.

వెంకన్న వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - యలమంచిలి : మండలంలోని ములకలాపల్లి మైహోం ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో శ్రీనగర్ కాలనీలో ఆదివారం వేంకటేశ్వరస్వామి 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయని మైహోం కంపెనీ అధినేత జూపల్లి రామేశ్వరరావు వెల్లడించారు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణంలో మంగళవాద్యాలతో యాగశాల ప్రవేశంతో వేడుక ప్రారంభమైందని, 21న శ్రీనివాస కల్యాణోత్సవ సందర్భంగా ఎదుర్కోలు ఉత్సవం జరుగుతుందన్నారు. 23న చినజియ్యర్ స్వామి మంగళ శాసనాలు జరుగుతాయన్నారు. పెద్దసంఖ్యలో భక్తులు, స్థానికులు పాల్గొన్ని, వెంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని జూపల్లి కోరారు

ప్రభుత్వ నిధులతో ప్రేమ సమాజం అభివృద్ధి

అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజు

ప్రజాశక్తి -చోడవరం : ప్రభుత్వ నిధులతో చోడవరం ప్రేమసమాజన్ని మరింతగా అభివృద్ధి చేస్తామని స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు అన్నారు. ఆదివారం ప్రేమ సమాజంలో నూతనంగా ఏర్పాటుచేసిన సోలార్ సిస్టమ్, నూతన భవనం డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్టు, గ్రంథాలయాన్నిప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైజాగ్ ప్రేమ సమాజానికి ధీటుగా చోడవరం ప్రేమ సమాజాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. చోడవరం ప్రాంతంలో వందేళ్ళ క్రిందట వేపా భీమ శంకరరావు వికలాంగుల ధర్మ సత్రంగా, గంజి కేంద్రంగా దీన్ని నెలకొల్పారని, తర్వాత ప్రేమ సమాజంగా రూపాంతరం చెంది ఏంతో మంది బడుగు, బలహీన,అనాథ వృద్ధులకు, పిల్లలకు తిండి, వసతి కల్పించిందన్నారు. ప్రేమ సమాజం సలహా మండలి సభ్యులు పోసర్ల రామారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సుగర్ ఫ్యాక్టరీ మాజీ చైర్మన్ గూనూరు మల్లు నాయుడు బుద్ధ శివాజీ, ప్రేమ సమాజం మేనేజర్ ప్రసాద్ రాజు, ఆర్కె డిఎస్ ప్రసాద్ కమిటీ సభ్యులు సాకా రమేష్, అడ్వకేట్ డేవిడ్,పుట్టా గంగయ్య.ఫోరం ఫర్ బెటర్ చోడవరం నుంచి దేముడు మాష్టర్, డ్రాయింగ్ టీచర్ సూర్యనారాయణ, ఆడమ్స్ వెంకటరావు, బ్యాంక్ రమేష్, రెడ్డి, బలరాం, సంతోష్,సురేష్,చంద్ర శేఖర్, ప్రకాశరావు, కన్నయ్యశెట్టి, సూర్యనారాయణ పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

రాజేష్, అర్చన దంపతులను సత్కరిస్తున్న లక్ష్మీపురం వాసులు

ప్రజాశక్తి-చోడవరం రూరల్: చోడవరం మండలం లక్ష్మీపురం గ్రామంలో అబ్దుల్ కలాం సరస్వతి విజ్ఞాన కేంద్రం అనే గ్రంథాలయం పర్యవేక్షణకు పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ పీపుల్స్ లీడ్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రాజేష్, అర్చన దంపతులు ఆదివారం విచ్చేశారు. గ్రామంలోని యువకులు, విద్యార్థులు, నిరుద్యోగులతో మాట్లాడి, గ్రంథాలయ పరిస్థితులను అడిగి తెలుసుకోవడమే కాక స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రంథాలయంలో ఒక టీచర్‌ను నియమించి రోజూ ఒక పూటా పోటీపరీక్షలపై నిరుద్యోగులకు శిక్షణనిప్పించే చర్యలు తీసుకుంటామని, స్థానిక యువత దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా రాజేష్, అర్చన దంపతులను గ్రామపెద్దలు, యువకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భవాని గణపతి నాయుడు, మైచర్ల పాలెం బూరె కొండయ్య, లక్ష్మీపురం నిరుద్యోగులు, యువకులు వార్డు సభ్యుడు సాయిరాం రాజు గ్రామ పెద్దలు భూతనాదు రామారావు, మాజీ వార్డు సభ్యుడు పిల్లా బుజ్జి, పాల్గొన్నారు

ఉద్యోగ, ఉపాధి హామీలు అమలయ్యేనా?

- ఎంపీ సీఎం రమేష్‌వైపు చూస్తున్న నిరుద్యోగ యువత
- మాటల స్థాయిలో చేతలు లేకపోవడంతో నిరాశ

ప్రజాశక్తి- అనకాపల్లి రూరల్ : అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ ఎన్నికల హామీపై నిరుద్యోగ యువత ఆశాభావంతో ఎదురుచూస్తున్నారు. ఆరు నెలల్లో పరిశ్రమలు తీసుకొచ్చి వేలల్లో ఉద్యోగాలు కల్పిస్తానన్న హామీపై గ్రామీణ జిల్లా యువత లెక్కలేసుకుంటున్నారు. ఇదిగో ఉద్యోగం అదిగో ఉద్యోగం అనుకోవడం తప్ప, ఎక్కడా అలాంటి అవకాశాలు కాన రాకపోవడంతో నిరుద్యోగ యువత నిరాశ దృక్పథంలో ఉన్నారు. గ్రామీణ జిల్లాలో ఏడు నియోజకవర్గాల్లో సుమారు 5 లక్షల మంది యువత ఉన్నారు. వివిధ విద్యార్హతలతో పాటు నిరుద్యోగంతో అల్లాడుతున్న వారు వేలల్లో ఉంటారు. వారందరికీ ఎప్పుడు, ఎలాంటి ఉద్యోగం వస్తుందనేది తెలియని స్థితి.

నిజానికి కడప నుంచి వచ్చిన అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్‌కు ఇక్కడ ఎలాంటి బలం లేదు. ఈ ప్రాంతానికి సుపరిచితుడు అంతకన్నా కాదు. కానీ అతని గెలుపులో అతనిచ్చిన హామీలే కీలకమనేది విశ్లేషకుల మాట. తనను గెలిపిస్తే అనకాపల్లి పరిసర ప్రాంతాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేస్తానని, యువతకు భారీగా ఉద్యోగాలు కల్పిస్తానన్నారు. ఆ హామీతో సీఎం రమేష్ రాజకీయ ఉపాధి పొందారు. దానితో రైల్వే బోర్డులో కూడా ఓ పదవి దక్కింది.. మరి యువతకు ఉపాధి కల్పించే పరిశ్రమల ఏర్పాటులో ఎంపీ ప్రయత్నం ఏ మేరకు ఉందో స్పష్టత లేకపోవడంతో యువతలో నిరాశ కనిపిస్తుంది. నక్కపల్లిలో ఏదో ఒక ప్లాంట్ వస్తుందనుకుంటే దానిలో స్థానిక యువతకు ఏ మేరకు ప్రయోజనం చేకూరుతుందో కూడా అంచనా వేయలేని పరిస్థితి. చంద్రబాబు సన్నిహితుడిగా, కేంద్ర పెద్దలతో పరిచయాలు ఉన్న నేతగా చెప్పుకున్న ఆయన ఈ ప్రాంత అభివృద్ధిపై ఏ మేరకు కృషి చేస్తున్నారో స్పష్టం చేయాలని స్థానికులు అంటున్నారు.

వాస్తవానికి సీఎం రమేష్ స్థానికేతురుడు కావడంతో ఇక్కడ ప్రజలకు అంతగా అందుబాటులో ఉండటం లేదు. నియోజవర్గంలో సమస్యలపై పట్టు సాధించలేకపోతున్నారనే విమర్శలూ ఉన్నాయి. పరిశ్రమల స్థాపనపై కూడా నిరుద్యోగులు ఆశించినంతగా దృష్టి పెట్టలేకపోతున్నారనే విమర్శలు ఉన్నాయి. అయితే అతను ఇచ్చిన హామీ మేరకు తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీని ఆధునికరించినా కొంతలో కొంత ఉపశమనం లభిస్తాదనేది స్పష్టం. దానితో చెరుకు దిగుబడి పెరిగే అవకాశం ఉంటుంది. చౌక డిపోలో సుగర్ ను దిగుమతి చేసుకొని ఇచ్చే కన్నా, ఇక్కడ ఫ్యాక్టరీ ఆధునీకరణతో లబ్ధి పొందే అవకాశం ఉంటుంది. మరొక పక్క బై ప్రొడక్ట్స్ కూడా సుగర్‌తో తయారు చేసుకోవచ్చు. అనకాపల్లిలో చెరుకు పరిశోధన కేంద్రం ఉన్న నేపథ్యంలో తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీని ఆధునికరిస్తే ప్రయోజనాలు ఎన్నో అన్నది అందరి మాట. ఉద్యోగాల మాట తర్వాత. కనీసం ఎన్నికల హామీ మేరకు నియోజకవర్గాల్లో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్స్ ఏర్పాటు చేసే చర్యలు ఎంపీ తీసుకుంటే బాగుంటుందనేది నిపుణుల మాట. విద్యార్హతను బట్టి స్కిల్స్ పెంచే సెంటర్‌లు ఏర్పాటు చేయాలనేది ఈ ప్రాంత వాసుల తపన. అచ్యుతాపురంలో ఏర్పాటు చేసిన స్కిల్ సెంటర్‌కు నిధుల కొరత ఉండడంతో యువతకు ప్రయోజనం అందని ద్రాక్షగా మిగులుతుంది. అయితే కేంద్ర రాష్ట్రాల్లో చక్రం తిప్పగలిగే నాయకుడిగా సీఎం రమేష్‌ను నమ్ముతున్న యువత ఆశలు ఏ మేరకు నెరవేరుతాయో చూడాలి.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

మజ్జిగ పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

ప్రజాశక్తి- అనకాపల్లి : అనకాపల్లి నూకాంబిక అమ్మవారి ఆలయం వద్ద ఆదివారం ఇంటర్నేషనల్ లయన్స్ క్లబ్ ,అనకాపల్లి శాఖ ఆధ్వర్యంలో సుమారు ఐదు వేల మందికి మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సెక్రటరీ డాక్టర్ రాకేష్, జాయింట్ సెక్రటరీ కం క్యాషియర్ ఎరుబండి సత్యనారాయణ, ఎడిషనల్ సెక్రెటరీ రత్నాజీ, లయన్స్ క్లబ్బు ప్రతినిధులు సుధీర్, వేణు, వంకాయల ఈశ్వర రావు, రాంజీ, నూకాంబికా డైరెక్టర్ సురేష్ సతీష్ పాల్గొన్నారు.

నూతన క్రీడా విధానం హర్షనీయం

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న క్రీడాకారులు

ప్రజాశక్తి- అనకాపల్లి : నూతన క్రీడా విధానం ద్వారా క్రీడాకారుల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చొరవపై పలువురు క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు. చంద్రబాబు జన్మదినం సందర్భంగా ఆయన చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. క్రీడాకారులకు వారి భవిష్యత్తును తీర్చిదిద్దే విధంగా భరోసాను కల్పిస్తూ నూతన క్రీడా విధానం పాలసీ ప్రకటించడంపై సంతోషం వ్యక్తం చేశారు. 29 క్రీడలకే పరిమితమైన క్రీడా పాలసీని65 క్రీడలలో పాల్గొనే క్రీడాకారులందరికీ ఉద్యోగ విద్య అవకాశాలను కల్పించేలా రూపొందించడం గర్వకారణం అన్నారు. ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికారిక సంస్థ ఆధ్వర్యంలో గుర్తింపు పొందిన 65 క్రీడల సంఘాలతో పాటుగా ఆంధ్రప్రదేశ్ టెన్నికోయిట్ అసోసియేషన్ తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. పశ్చిమ ఎమ్మెల్యే చీఫ్ ప్యాట్రాన్ పి.గణబాబు, చైర్మన్ వై డి రామారావు, అధ్యక్షులు పి రవీంద్ర, ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ ఎ.కృష్ణకుమారి , ఆంధ్రప్రదేశ్ టెన్నికోయిట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కెఎన్‌వి సత్యనారాయణ, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

సమావేశంలో మాట్లాడుతున్న పివిఎస్ఎన్ రాజు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : పార్టీ బలోపేతం, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని జనసేన చోడవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎస్ఎన్.రాజు అన్నారు. ఆదివారం పెద్దమదీనో సర్పంచ్ కొలిమల్ల వెంకట రమణ అధ్యక్షతన పార్టీ ఆత్మీయ సమావేశంలో బుచ్చయ్యపేట మండల జెనసేన ముఖ్య నాయకుల ఆత్మీయ సమావేశం ఆదివారం మాట్లాడుతూ గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వ పథకాలను ప్రజలకు తెలియజెప్పాలని, అర్హులకు అందేలా కృషి చేయాలన్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబుకు జన్మదిన శు భాకాంక్షలు తెలిపారు. బుచ్చయ్యపేట మండల పార్టీ అధ్యక్షులు డిఎస్ నాయుడు, సీనియర్ నాయకులు అడపా నరసింహ మూర్తి , దాడి సూరి నాగేశ్వరరావు ,దొండ సాయి, తుమ్మపాల రమేష్, సిరిపురపు రమేష్, అల్లం రామప్పరావు, నందవరపు రమాదేవి, బలిజ మహారాజు, గూనూరు మూలునాయుడు, గుండు గణేష్ , మండపాక బాబురావు, అరుణ్, గంట్ల నరేష్, కర్రి రమేష్, చప్పగడ్డ శ్రీను ,కొల్లిమల్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు

కోఆప్షన్ సభ్యుని కుటుంబానికి ఎంపిటిసిల అండ

ప్రజాశక్తి -చోడవరం : మండలం లక్ష్మీపురం గ్రామంలో ఇటీవల చనిపోయిన మండల కోఆప్షన్ సభ్యులు అబ్దుల్ రహమాన్ కుటుంబానికి మండలంలోని తోటి ఎంపిటిసిలు అండగా నిలిచారు. రెహమాన్ భార్య షైక్ ఆస్మా బీబీకి రూ.30 వేల ఆర్థిక సాయాన్ని ఎంపిపి జాడికాసులమ్మ ద్వారా నగదును అందజేశారు. చనిపోయిన కుటుంబానికి తామందరము అండగా నిలుస్తామని ధైర్యం చెప్పారు. ప్రస్తుతం నాలుగో తరగతి చదువుతున్న రెహమాన్ రెండవ కుమార్తె షేక్ అప్సానాబేగం డిగ్రీ చదివే వరకు అవసరమైన ఖర్చును చోడవరం నియోజకవర్గం వైసిపి ఇన్‌ఛార్జి గుడివాడ అమర్‌నాథ్ స్వయంగా చూసుకుంటానని హామీ ఇచ్చారని ఏడువాక సత్యారావు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి బైనా ఈశ్వరరావు కుమారి, లక్కవరం ఎంపిటిసి రాజు నాయుడు, లక్ష్మీపురం ఎంపిటిసి సంద్రాన వీరన్న, సిరుసోళ్ల భవాని గణపతి పాల్గొన్నారు

నగదు సాయం అందిస్తున్న ఎంపిపి, వైసిపి ఎంపిటిసిలు

అగ్ని ప్రమాదాలపై అవగాహన

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని అగ్నిమాపక వారోత్సవాలు ఆదివారంతో ముగిసాయి. స్థానిక అగ్నిమాపక కేంద్రంలో అగ్నిమాపక అధికారి జివి.సత్యరాజు ఆధ్వర్యంలో స్థానిక ప్రజలకు, విద్యార్థులకు అగ్ని ప్రమాదాలు జరిగినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అగ్నిమాపక పరికరాలు ప్రదర్శన చేశారు. అగ్నిమాపక పరికరాల పనిచేయు విధానం వివరించారు. అగ్ని ప్రమాదాలు, ప్రకృతి విపత్తులు సమయంలో రాష్ట్ర విపత్తుల స్పందన, అగ్నిమాపక సేవల శాఖ పాత్ర ను వివరించి అవగాహన కల్పించారు. అగ్నిమాపక అత్యవసర సేవలు కొరకు 101 లేదా 08924248799 నెంబర్‌కు ఫోన్ లో సంప్రదించాలని తెలిపారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఫైర్ ఆఫీసర్ సత్యరాజు

చంద్రబాబు మోసాలపై పోరాటానికి సిద్ధంకండి

మాట్లాడుతున్న సిపిఐ జిల్లా కార్యదర్శి రమణ

ప్రజాశక్తి అనకాపల్లి రూరల్: చంద్రబాబు ప్రభుత్వం మోసాలపై పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఐ సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ పిలుపునిచ్చారు. ఆదివారం వెంకుపాలెం గ్రామంలో సిపిఐ మండల మహాసభలో మాట్లాడుతూ, అధికారంలోకి రాకముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను తక్షణమే అమలు చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 నెలలు అవుతున్న ఇచ్చిన హామీలను అమల చేయడంలో విఫలం అయ్యారని ఆరోపించారు.

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఎపుడిస్తారని ఎద్దేవా చేశారు.. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని మోసం చేశారని ఏడేళ్లుగా కోచింగ్ తీసుకుంటున్న యువతను వయోపరిమితి పెంచుకుండా మెగా డిఎస్‌సి విడుదల చేసి నిరుద్యోగల ఆశలపై కూటమి ప్రభుత్వం నీళ్లు చల్లిందని మండిపడ్డారు వచ్చేనెల 5 6 7 తేదీలలో జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు.. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు రెడ్డి పెల్లి అప్పల రాజు, వైన్ భద్రం, కొర్రయి రమణ, చిరా నాగమణి, తదితరులు పాల్గొన్నారు . అనంతరం సిపిఐ మండల కార్యదర్శిగా వియ్యపు రాజు,నూతన కమిటీని ఎన్నుకున్నారు

నూకాంబిక దర్శనానికి పోటెత్తిన భక్తులు

ప్రజాశక్తి అనకాపల్లి రూరల్: అనకాపల్లి గవరపాలెం నూకాంబిక దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఆధ్వర్యంలో జరుగుతున్న కొత్త అమావాస్య, రాష్ట్ర జాతరలో భాగంగా నాలుగవ ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారినీ దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. దేవస్థానం ఆవరణలో వంటలు వండుకొని అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. దేవస్థానం ఆధ్వర్యంలో క్యూలైన్‌లో భక్తులకు తాగునీరు, పిల్లలకు పాలు, పంపిణీ చేశారు.

ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నామని ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగ శ్రీను (గొల్ల బాబు), ఆలయ సహాయ కమిషనర్ వెంపల రాంబాబు తెలిపారు. ఆలయ ధర్మకర్తలు సూరేసతీష్,దాడి రవికుమార్ పొలిమేర ఆనంద్, మారిశెట్టి శంకర్రావు, కాండ్రేగుల రాజారావు,మజ్జి శ్రీనివాసరావు కొడుకుల శ్రీకాంత్,వడ్డాది మంగ,కోనేటి సూర్యలక్ష్మి ఎర్రవరపు లక్ష్మి, కూటమి నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు

గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం'

ప్రజాశక్తి -అచ్యుతాపురం : స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం గ్రంథాలయ అధికారి దొడ్డి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో చదవడం మాకిష్టం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చదువు, దాని ప్రాముఖ్యత, తదితర అంశాలను వివరించారు.పలు పుస్తకాలను వారితో చదివించారు.

ఘనంగా బండమ్మ పండగ

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని అరిపాక పంచాయతీ శివారు పెదయాత పాలెం గ్రామంలో బండమ్మ పండగ ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా అమ్మవారికి పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు, సోదరులు పంచకర్ల వెంకటేశ్వరరావు దర్శించుకొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి శరగడం ఝాన్సీ రాము దంపతులు, ఇందల వెంకటరమణ, సాలాపు వెంకటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు కనకరాజు, మామిడి కొండాజి, మామిడి శంకర్రావు, కర్రి నరసింగరావు, బోకం సోము నాయుడు, కాళ్ళ శ్రీనివాసరావు, ఆడారి వెంకట్, ఆడారి నాగరాజు, చిన్న రాజుగారు, శరగడం శంకరరావు, శరగడం వెంకట్రావు, బొడ్డేటి కాశి, నాగభూషణ్ , వినోద్, బంతి కోళ్ల పద్మ, కంచిపాటి రాంబాబు, సింగంపల్లి శ్రీను, గొర్లి కుమార్, బొడ్డ పల్లి సూరిబాబు, కిల్లి వెంకట సత్యనారాయణ, తాటిపాము శేఖర్, సబ్బవరపు రవి ,సరిపల్లి విష్ణు ,జెట్టి ప్రసాదు , సబ్బవరపు రమణ, మెడపాటి రాము ,తమరాలసత్యనారాయణ,మంగరాజు, కుచ్చెర్లపాటి నరసింహమూర్తి రాజు ,కోరుకొండ నాయుడు, పల్లా రమణ, సబ్బవరపు రామకష్ణ, మడ్డు రమేష్, కూటమి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు

నక్కపల్లిలో కేక్ కట్ చేస్తున్న హోం మంత్రి అనిత

ప్రజాశక్తి-యంత్రాంగం

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పుట్టిన రోజు వేడుకలను విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో ఆదివారం పలుచోట్ల ఘనంగా జరిపారు.

పద్మనాభం : పద్మనాభం జంక్షన్‌లో ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద ఆదివారం ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటం పెట్టి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో కె.లీలావతి, కె.దామోదరరావు, లక్ష్మీనాయుడు పాల్గొన్నారు.

సీతమ్మధార : 37వ వార్డు క్లస్టర్ ఇన్‌ఛార్జి బంగారి రవిశంకర్, వార్డు అధ్యక్షులు కోనాడ చిన్న ఆధ్వర్యాన 200 మంది పేదలకు వస్త్ర, అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో గరికిన రవి, రమేష్, తాతాజీ పాల్గొన్నారు.

గాజువాక : చంద్రబాబు పుట్టినరోజు సందర్భంగా పాత గాజువాకలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రసాదుల శ్రీనివాస్ ఆధ్వర్యాన కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో వాసు, ఎస్.అనంతరావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వంటిల్లు జంక్షన్‌లో 73వ వార్డుకు చెందిన బలగ నాయుడు ఆధ్వర్యాన చలివేంద్రాన్ని ఏర్పాటుచేసి మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచదార్ల ఉగ్రం, ప్రసాదు పాల్గొన్నారు.

మధురవాడ : జివిఎంసి 6వ వార్డు పరిధిలోని మధురవాడ వృద్ధుల ఆశ్రమంలో తెలుగు యువత పార్లమెంటరీ జిల్లా ఉపాధ్యక్షుడు గరే గుర్నాథ్ ఆధ్వర్యాన కేక్ కట్ చేసి వృద్ధులకు పంచిపెట్టారు. భోజనం, పండ్లు అందజేశారు. ఆరో వార్డు పిఎం.పాలెం పార్టీ కార్యాలయంలో పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి శ్రీనివాస్ ఆధ్వర్యాన జన్మదిన వేడుకలు నిర్వహించారు.

మాధవధార : జివిఎంసి 51వ వార్డులో పార్టీ వార్డు అధ్యక్షుడు సనపల కీర్తి ఆధ్వర్యాన కేక్ కట్ చేశారు. కార్యకర్తలకు పంచిపెట్టారు. పేద వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పోలమరి శెట్టి శ్రీనివాసరావు, మూల రాము, అప్పారావు పాల్గొన్నారు.

భీమునిపట్నం : స్థానిక టిడిపి కార్యాలయంలో పలువురు పార్టీ నాయకులు, కార్పొరేటర్లతో కలిసి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కేక్ కట్ చేశారు. అనంతరం పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిఎవిఎన్.రాజు, పాసి నరసింగరావు, అక్కరమాని వెంకట రావు పాల్గొన్నారు.

తగరపువలస జంక్షన్‌లో టిడిపి ఒకటో వార్డు కమిటీ ఆధ్వర్యాన కేక్ కట్ చేశారు. మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో తమ్మిన సూరిబాబు, పిట్ట సురేష్, కొప్పల రమేష్ పాల్గొన్నారు

గోపాలపట్నం : విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గణబాబు ఆధ్వర్యాన ఆయన క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. పెద్ద కేకును కట్ చేశారు.

పెందుర్తి: చంద్రబాబు జన్మదిన వేడుకలను జివిఎంసి 97వ వార్డు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో వైభవంగా నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ సేనాపతి వసంత శంకర్రావు కేకు కట్ చేసి పార్టీ శ్రేణులకు తినిపించారు. జివిఎంసి పారిశుధ్య సిబ్బందికి రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. అవగడ్డ అప్పలనాయుడు, మహేష్, అర్జున్ పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : చంద్రబాబు పుట్టిన రోజు వేడుకలు టిడిపి జిల్లా కార్యాలయంలో రాష్ట్ర కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్ గండి బాబ్జి అధ్యక్షతన ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు వేపాడ చిరంజీవిరావు, దువ్వారపు రామారావు, జివిఎంసిలో టిడిపి ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నక్కపల్లి:నక్కపల్లిలో హోం మంత్రి క్యాంప్ కార్యాలయం వద్ద హోం మంత్రి అనిత బర్త్ డే కేక్ కట్ చేశారు. మంత్రి క్యాంప్ కార్యాలయం వద్ద అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నక్కపల్లిమండలంలోని గొడిచెర్ల గ్రామంలో టిడిపి నేత మాజీ వైస్ ఎంపీపీ వెలోయిన రమణ ఆధ్వర్యంలో ఆదివారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పాలు, రొట్టె పంపిణీ చేశారు.

చీడికాడ:చీడికాడ, జెతవరంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలను మాడుగుల నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

రావికమతం:మండలంలోని చినపాచిల సర్పంచ్ కోమటి శంకర్రావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు ఆధ్వర్యంలో చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. రావికమతం సర్పంచ్ గెంజి మోది నాయుడు, పార్టీ అధ్యక్షుడు గెంజి ఈశ్వరరావు, ఎంపీటీసీ వేపాడ నాగేశ్వరావు ఆధ్వర్యంలో మండల కేంద్రంలో జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆసుపత్రుల్లో రోగులకు పాలు, రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చినపాచిల పాల సంఘం అధ్యక్షుడు రాజారావు, రావికమతం మాజీ స్కూల్ కమిటీ చైర్మన్ వేపాడ శ్రీను పాల్గొన్నారు.

మాడుగుల: విజన్ ఉన్న నాయకుడు నారా చంద్రబాబు నాయుడు అని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు కొనియాడారు. మాడుగుల పట్టణంతోపాటు పలుచోట్ల టిడిపి నాయకులు ఈ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మాడుగుల పట్టణ అధ్యక్షులు వద్దాది రంజిత్ వర్మ ఆధ్వర్యంలో పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బస్టాండ్ ఆవరణలో పుప్పాల అప్పలరాజు కేక్ కట్ చేశారు. సెంటెన్స్ వృద్ధాశ్రమంలో వృద్ధులకు పాలు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ పుప్పాల రమేష్, లెక్కల కాశి బాబు, సూర్యనారాయణ వర్మ, మరువాడ ఈశ్వరరావు, జొన్న పల్లి రమేష్ పాల్గొన్నారు.

అనకాపల్లిలో...

నర్సీపట్నం టౌన్:స్థానిక అబీద్ సెంటర్‌లో 75కేజీల భారీ కేకును మున్సిపాలిటీ 25వ వార్డు కౌన్సిలర్ చింతకాయల రాజేష్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ 24వ వార్డుకు సంబంధించిన పిల్లి మహేశ్వరరావుకు ముఖ్యమంత్రి సహాయనిధి 1,18,000 రూపాయల చెక్కును రాజేష్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా చింతకాయల రాజేష్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆయురారోగ్యాలతో ఇలాంటి పుట్టినరోజులు ఎన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు.

అనకాపల్లి రూరల్: రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్, ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్, పీలా గోవింద సత్యనారాయణ ఆధ్వర్యంలో చంద్రబాబు పుట్టినరోజు సందర్భంగా రక్తదాన శిబిరం, పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. గర్భిణులు, రోగులకు పండ్లు రొట్టెలు పంపిణీ చేశారు. మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, బిజెపి జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వర రావు, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ సురేంద్ర పాల్గొన్నారు.

అనకాపల్లి రూరల్ : ఎన్టీఆర్ హాస్పిటల్ వద్ద రామానాయుడు కాలనీలో ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. గవర కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ మళ్ల సురేంద్ర ఆధ్వర్యంలో పేద కుటుంబాలకు టిఫిన్, పండ్లు పంపిణీ చేశారు. నూకాంబిక ఆలయంలో చంద్రబాబు పేరిట ప్రత్యేక పూజలు చేశారు. నూకాంబిక దేవస్థానం ఉత్సవం కమిటీ

మాధవధారలో...

భీమిలిలో...

చైర్మన్ పీలా నాగ శ్రీను ,మారిశెట్టి శంకర్రావు, దాడి రవికుమార్. పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : మండలంలో బుచ్చయ్యపేట వడ్డాది, దిబ్బిడి, రాజాం తదితర గ్రామాల్లో చంద్రబాబు పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

సబ్బవరం: ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదినం సందర్భంగా బర్త్‌డే కేకును ఏపిఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్ గండి బాబ్జి కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు. పాలు రొట్టెలు పంచిపెట్టారు. కార్యక్రమంలో యువనేత గండి వంశీదీప్, మండల టిడిపి అధ్యక్షుడు మిడతాడ మహాలక్ష్మి నాయుడు, భరణికాన సాయినాథరావు, గండి ముత్యాల నాయుడు, రెడ్డి నారాయణరావు, గండి దేముడు , కోటాన అప్పారావు, రొంగలి దేముడు బాబు పాల్గొన్నారు.

కె.కోటపాడు : మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయంలో చంద్రబాబు పుట్టినరోజు సందర్భంగా కేకును ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి కట్ చేశారు. ఆసుపత్రిలో రోగులకు పళ్ళు రొట్టెలు అందించారు. చౌడువాడ, ఎ.కోడూరు, కింతాడ తదితర గ్రామాల్లో చంద్రబాబు జన్మదిన వేడుకలు నిర్వహించారు. నాయకులు పివిజి కుమార్, రొంగలి మహేష్ , జూరెడ్డి రాము, బత్తి వెంకటరమణ, దొకల నరసింహ మూర్తి, దాడి ఎరుకు నాయుడు పాల్గొన్నారు.

కశింకోట : మండలం జి. భీమవరం గ్రామం లో ఉపాధి కూలీలసమక్షంలో ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదిన వేడుకలు జరిగాయి. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్య నారాయణ కేక్ కట్ చేసి కూలీలకు తినిపించారు. తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి గోంతిని శ్రీను వాసరావు, ఉల్లింగల రమేష్, కాయలు మురళి, కలగా సోమేశ్వరరావు, పాల్గొన్నారు.

చోడవరం :. చోడవరం టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి మల్లు నాయుడు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ నాగ గంగాధర్ మాజీ ఎంపీపీ జి వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

అచ్యుతాపురం : అచ్యుతాపురంలో ఏపి రహదారులు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో చంద్రబాబు జన్మదిన వేడుకలు జరిగ్గాయి. టిడిపి రాష్ట్రకార్యదర్శి రాజాన రమేష్ కుమార్ పర్యవేక్షణలో మండల కాంప్లెక్స్ క్రీడా మైదానంలో 19 కోలాట బృందాల ప్రదర్శన నిర్వహించారు. నునపర్తిలో రెడ్డి నగేష్, తిమ్మరాజుపేటలో కర్రి ఆదిబాబు ఎస్ శివబాబునాయుడు, జగ్గన్నపేటలో టిడిపి కార్యకర్తలు కేకు కట్ చేశారు. విందు భోజనాలు ఏర్పాటుచేశారు.

దేవరాపల్లి : మండల కేంద్రం దేవరపల్లిలో మండల పార్టీ అధ్యక్షులు చిటిమిరెడ్డి సూర్యనారాయణ,మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు ఆధ్వర్యంలో చంద్రబాబు పుట్టినరోజు కేకు కట్‌చేసి అందరూ తినిపించుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పళ్ళు రొట్టెలు పంపిణీ చేశారు కార్యక్రమంలో రైవాడ జలాశయ చైర్మన్ పోతల పాతిరి నాయుడు, శరకాన సూర్యనారాయణ, కొమర బాబూరావు పాల్గొన్నారు

యలమంచిలి : స్థానిక టిడిపి కార్యాలయంలో చంద్రబాబు పుట్టినరోజు సందర్భంగా కేకు కట్ చేశారు. ఏపి రహదారులు కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, మాజీ ఎం.పి. పప్పల చలపతిరావు పాల్గొన్నారు. ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పళ్ళ, రొట్టెలు, పాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కలుకులూరి విజయబాబు, మండల పార్టీ అధ్యక్షులు రాజు, నానాజీ, రమణబాబు పాల్గొన్నారు.

మహిళతో మాట్లాడుతున్న వెలుగు సిసి

మహిళల్లో జీవనోపాధిని పెంపొందించాలి

ప్రజాశక్తి- కోటవురట్ల:ప్రభుత్వం అందజేసే సబ్సిడీతో రుణాలతో పాటు వ్యక్తిగత రుణాలతో గ్రామీణ ప్రాంతాల్లో మహిళల్లో జీవనోపాధి పెంపొందించాలని వెలుగు సీసీ సత్యవతి తెలిపారు. ఆదివారం వెలుగు సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ , సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గ్రూపులకు అందజేస్తున్న రుణాలతో మహిళల్లో ఉపాధి పెంపొందించేందుకు ఇప్పటినుంచే ప్రణాళికలు సిద్ధం చేయాలని సిబ్బందికి సూచించారు, గ్రూపు సభ్యులకు ఎప్పటికప్పుడు సమావేశాలు ఏర్పాటు చేసి బ్యాంకు లావాదేవీలపై అవగాహన కల్పించాలన్నారు, సమైక్య సంఘాలను బలోపేతం చేసే బాధ్యత వెలుగు వివోఏలపై ఉందని సంఘాలు చేసుకుంటున్న పొదుపును సద్వినియోగం చేసుకోవాలన్నారు. వడ్డీ లేని రుణాలు ప్రతి ఒక్కరికి పారదర్శకంగా అందించేందుకు చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా తెలిపారు ఈ కార్యక్రమంలో పలువురు వివోఏలు పాల్గొన్నారు.

గూడుపమ్మ ఆలయం కిటకిట

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలో రేబాకలో గూడుపమ్మ క్షేత్రానికి ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

పూజలు చేస్తున్న భక్తులు

ఎలమంచిలి, ఎస్ రాయవరం, నక్కపల్లి, పాయకరావుపేట, కోటనందూరు, తుని తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలి రావడంతో ఆలయ ప్రాంగణం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. ఆలయ ధర్మకర్త గొట్టుముక్కల శ్రీహరి రాజు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఆలయానికి 50 కిలోల ఇత్తడి వితరణ

ప్రజాశక్తి - మాడుగుల:మండలంలోని ఎం.కోడూరు గ్రామంలో మోదమాంబ అమ్మవారికి అదే గ్రామానికి చెందిన ముమ్మిన అప్పారావు బ్రదర్స్ కుమారులు కుటుంబ సభ్యులు, కాకర అప్పారావు దంపతుల కుమారులు, ఎంపీటీసీ ముమ్మిన రమణబాబు, పార్వతి దంపతులు అమ్మవారి విగ్రహానికి 50 కేజీలు పంచలోహాలు తొడుగును అందజేశారు. సుమారు 80 వేలు రూపాయలతో చేయించి ఆదివారం ఆలయ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి సంజీవిరావుకి అందించారు.ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు శ్రీనివాస్ శర్మ మాజీ కో-ఆపరేటివ్ అధ్యక్షులు పడాల అప్పలనాయుడు, అప్పాన ప్రసాద్, జాజిమొగ్గల చిరంజీవి, అప్పాన నాయుడు, కలిమి గోపాల్, శివ జొన్నపల్లి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు రెండు దుక్కిటెద్దులు మృతి

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:మండలంలోని బొండం పంచాయితీ రంగినిగూడ గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో పడిన అకాల వర్షానికి పిడుగుపడి రెండు దుక్కిఎద్దులు మృతి చెందాయి. గ్రామ

మృతి చెందిన దుక్కిటెద్దులు

సమీపంలో ఆవులు, పశువులను మేతకు తీసుకెళ్లగా పిడుగుపడి అక్కడికక్కడే రెండు ఎద్దులు మృతి చెందాయి.గ్రామానికి చెందిన కిల్లో మొద్దు, స్వాబి సింహాచలంకు సంబంధించిన రెండు దుక్కి ఎద్దులు మృతి చెందాయి. దుక్కిఎద్దులు చనిపోవడంతో రైతు కన్నీరు మున్నీరుగా విలపించారు. తక్షణమే ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

మాట్లాడుతున్న రామకృష్ణారావు

పేదలను ఆదుకుంటాం

- అంతర్జాతీయ వాసవి క్లబ్ అధ్యక్షులు రామకృష్ణారావు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో రెండు రోజుల పర్యటనలో భాగంగా అంతర్జాతీయ వాసవి క్లబ్ అధ్యక్షులు ఇరుకుల్ల రామ కృష్ణారావు ఆదివారం నర్సీపట్నం క్లబ్బులో పర్యటించారు. స్థానిక వేదిక ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రామకృష్ణారావు మాట్లాడుతూ, పేదలను ఆదుకుంటామని తెలిపారు. ముందుగా ఆయనతో పాటు వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ గవర్నర్ పూర్ణిమ కు ఘన స్వాగతం పలికారు. అనంతరం సుమారు షుగర్ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. స్థానిక గోశాలను సందర్శించి ప్రభుత్వ పాఠశాలకు వాటర్ ట్యాంకును అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణారావు మాట్లాడుతూ, అంతర్జాతీయ స్థాయిలో వాసవి క్లబ్ నిర్వహిస్తున్న పథకాలకు అపూర్వ స్పందన లభిస్తుందని, మరెన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. సరస్వతీ పథకం ద్వారా పేద విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్లు, బాలికలకు సైకిల్ పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో క్యాబినెట్ టీం వెలగా నారాయణరావు, పద్మనాభుని రాజేశ్వరి, దేవత అరుణ వైస్ గవర్నర్ కంచర్ల రమేష్ , పాడేరు శ్రీను, వనిత క్లబ్ ప్రెసిడెంట్ గ్రంథి రాధా శ్రీ , సెక్రెటరీ కె విజయలక్ష్మి, ట్రెజర్ దాసరి దేవి, క్లబ్ సభ్యులు, పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెడి లక్ష్మీనారాయణ

విద్యార్థుల అభివృద్ధిలో తల్లిదండ్రుల పాత్ర కీలకం

- సిబిఐ మాజీ జెడి లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి -అరకులోయ: విద్యార్థుల అభివృద్ధికి గురువులతో పాటు, తల్లిదండ్రులు ప్రధానమైన పాత్ర పోషించడం ద్వారానే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని మాజీ సిబిఐ జాయింట్ డైరెక్టర్ జెడి లక్ష్మీనారాయణ అన్నారు. అరకులోయలోని అల్లూరి సీతారామరాజు పబ్లిక్ స్కూల్లో ఆదివారం సాయంత్రం 40 వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం కూడా తల్లితండ్రులు, గురువుల ప్రోత్సాహంతోనే ఉన్నత స్థితికి చేరుకొని అణు శాస్త్రవేత్త కావడమే కాకుండా, భారత దేశానికి రాష్ట్రపతి వంటి అత్యున్నత పదవి అధిరోహించారని ని ఆయన అన్నారు. అల్లూరి సీతారామరాజు కూడా విద్యార్థి దశ నుంచే పోరాట పటిమ అలవర్చుకొని బ్రిటిష్ వారిని తరిమికొట్టి అందరి హృదయాల్లో నేటికీ బతికి ఉన్నారని ఆయన అన్నారు విద్యార్థులకు మహనేతల కథలు చెప్పడంతో వారిలో దేశభక్తి అలవడుతుందన్నారు. తల్లిదండ్రులు పిల్లలతో సమయం గడపాలని ఆయన సూచించారు. ముందుగా విద్యార్థులకు జేడీ లక్ష్మీనారాయణ చేతుల మీదుగా గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మహారాజా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అల్లూరి సీతారామరాజు సీబీఎస్ఈ పబ్లిక్ స్కూల్ అరకులోయ అధ్యక్షులు అల్లూరి సత్యనారాయణ రాజు, అనెస్తేసియా అకాడమిక్ డైరెక్టర్ మిమ్స్ డాక్టర్ టి.వేణుగోపాలరావు, ఆంధ్ర విశ్వవిద్యాలయం సెనేట్ అధ్యక్షులు, గీతం విశ్వవిద్యాలయం సభ్యులు బి.ఎస్.ఎస్.ఎన్. రాజు, కార్యదర్శి బి.రామకృష్ణ, అల్లూరి సీతారామరాజు పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ నర్సయ్య పాల్గొన్నారు.

ఎన్నాళ్లీ ఎదురుచూపులు..?

▶▶ గత ప్రభుత్వంలో రెండేళ్లు నిరీక్షణ

▶▶ కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదవుతున్నా మంజూరు కాని రేషన్ కార్డులు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : వివాహాలు జరిగి వేరే కాపురాలు పెట్టినా, పిల్లలు పుట్టినా సొంతంగా రేషన్ కార్డులు లేక వందలాది కొత్త జంటలు రేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో అడిగిన వెంటనే రేషన్ కార్డు అంటూ చేసిన ప్రకటనలు ప్రచారానికే పరిమితమయ్యాయి తప్ప అమలకు వచ్చేసరికి నానా షరతులు పెట్టి మంజూరు చేయలేదు. 2023 నుంచి రేషన్ కార్డులకు సంబంధించిన ప్రక్రియను నాటి ప్రభుత్వం పూర్తిగా నిలిపివేసింది. 2024 జూన్లో ప్రభుత్వం మారింది. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలల కావసున్నా ఈ ప్రభుత్వంలో సైతం కొత్త రేషన్ కార్డులను మంజూరు చేయలేదు. అలాగే రేషన్ కార్డులలో మార్పులు చేర్పులకు సంబంధించిన ప్రక్రియకు సైతం అవకాశం ఇవ్వకపోవడంతో వందలాదిమంది లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ మూడేళ్లగా మండలంలోని 35 గ్రామపంచాయతీలో సుమారు వెయ్యి మంది వరకు లబ్ధిదారులు రేషన్ కార్డులు కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు ప్రక్రియను ప్రారంభించాలని మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులు కోరుతున్నారు.

రెండేళ్లుగా సచివాలయం చుట్టూ తిరుగుతున్నాం

మాకు 2023 మే 4వ తేదీన వివాహమైంది. రేషన్ కార్డు కోసం గత రెండేళ్లగా సచివాలయాల చుట్టూ తిరుగుతున్నామే తప్ప రేషన్ కార్డు మంజూరు కాలేదు. మాకు బాబు జన్మించాడు. రెండు సంవత్సరాలు దాటిపోయిన రేషన్ కార్డు లేక ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం రేషన్ కార్డు మంజూరు చేయాలని కోరుతున్నాం.

- గంట పాలనాయుడు, భవాని, దిబ్బిడి

అక్రమార్కులకు వరంగా ఉచిత ఇసుక

▶▶ వెదుళ్లగెడ్డ వద్ద అక్రమంగా తవ్వకాలు

▶▶ రాజాంలో ఇసుక డంపింగ్

రాజాంలో వేసిన ఇసుక కుప్ప

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట: పేదల ఇళ్ల నిర్మాణాలకు కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ఇసుక పథకం అక్రమార్కులకు వరంగా మారింది. ఈ ఉచిత ఇసుక పథకం పేరు చెప్పి అక్రమార్కులు అడ్డూ అదుపు లేకుండా ఎక్కడబడితే అక్కడ ఇసుక తవ్వకాలను చేపడుతున్నారు. మండలంలోని వెదుళ్ళ గెడ్డ వంతెనను ఆనుకుని ఇసుక తవ్వకాలు ముమ్మురంగా జరుగుతున్నాయి. రాత్రివేళ, తెల్లవారు సమయంలో వెదుళ్ళ గెడ్డలో ఇసుక తవ్వకాలు చేపట్టి ట్రాక్టర్ల ద్వారా సమీపంలోని రాజాం గ్రామంలో డంపింగ్ చేస్తున్నారు. అక్కడి నుండి లారీలు ట్రాక్టర్లలో పట్టణ ప్రాంతాలకు తరలిస్తున్నారు. గత నెల రోజులుగా ఇక్కడ ఇసుక తవ్వకాలు చేపడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోలేదు. ఇసుక తవ్వకాలతో మండలంలోని వడ్డాది పెద్దేరు వంతెన, విజయరామరాజుపేట వద్ద తాచేరు వంతెన కూలిపోయాయి. వెదుళ్ళ గెడ్డ వద్ద కూడా ఇసుక తవ్వకాలు కొనసాగితే వంతెనకు ముప్పు తప్పదని పలువురు ఆందోళన చెందుతున్నారు. వంతెనకు ఆనుకునే పెద్ద పెద్ద గోతులు పెట్టి ఇసుక తరలిస్తున్నారు. ఇప్పటికే కందిపూడి చెరువుకి నీరు వెళ్లే గ్రోయిన్ దెబ్బతింది. అక్కడ రైతులుకి సాగునీరు అందక ఇబ్బంది పడుతున్నారు. వంతెన వద్ద ఇసుక తవ్వకాలు ఇలాగే కొనసాగితే భూగర్భ జలాలు అడుగంటి పోయి స్థానిక రైతులకు చుక్క నీరు అందని పరిస్థితి ఏర్పడుతుంది. వంతెనల సమీపంలో ఇసుక తవ్వకాలు చేపట్టకూడదన్న నిబంధనలను అక్రమార్కులు ఏమాత్రం పట్టించుకోకుండా ఇష్టా రాజ్యాంగా ఇసుక వ్యాపారం చేస్తున్నారు. అధికారులు ఇసుక తవ్వకాలను నియంత్రించక పోతే భవిష్యత్తులో వంతెనకు ముప్పు తప్పదని పలువురు హెచ్చరిస్తున్నారు.

కాగా దీనిపై స్థానిక తహసీల్దార్ ఎం లక్ష్మిని సంప్రదించగా... ఇసుక తవ్వకాలు అంశం తన దృష్టికి వచ్చిందని సంబంధిత తవ్వకాల ప్రదేశాన్ని పరిశీలించనున్నారు. ఇసుక తవ్వకాలు ఎవరు చేపట్టినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తవ్వకాలను నిలిపివేస్తామన్నారు. తవ్వకాలపై దృష్టి సారించాలని తమ రెవెన్యూ సిబ్బందికి ఆదేశాలు ఇచ్చామన్నారు.

వెదుళ్లగెడ్డ వద్ద ఇసుక తవ్వకాలకు తీసిన గొయ్యి

గంజాయి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు

-అల్లూరి జిల్లా ఎస్పి అమిత్ బర్దర్ -

ప్రజాశక్తి -చింతపల్లి: మండలంలోని ఏ.అన్నవరం పోలీస్ స్టేషన్ను జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ చింతపల్లి ఏఎస్పీ నవజ్యోతి మిశ్రా తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. నూతనంగా నిర్మిస్తున్న పోలీస్ స్టేషన్ భవనాలను పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు ప్రాంతంలో ఈ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కువగా ఉండడంతో గంజాయి రవాణా అవకాశం ఉందని, దీని నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని అన్నారు. యువత ఎటువంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడకుండా చర్యలు చేపట్టాలని పోలీసులకు సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఉపాధి అవకాశాలను గిరిజన రైతులు, యువత సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ వినోద్ బాబు, ఎస్ఐ వీరబాబు తదితరులు పాల్గొన్నారు

భవనాన్ని పరిశీలిస్తున్న ఎస్పి